ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 24.06.2026 | సంపుటి : 12 సంచిక : 335 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## చల్లని కబురు

**రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి రుతుపవనాలు**

**పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** గత కొన్నిరోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని వార్త చెప్పింది. దేశంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు పేర్కొంది. తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్‌లోకి ప్రవేశించాయని, వేగంగా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మధ్య అరేబియా సముద్రంలో ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా మిగతా 2లో..

## పేరు చెబితే రూ.లక్ష బహుమతి

- 'క్యూర్' పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు కసరత్తు
- ఈ కొత్త పథకానికి పేరు కోసం ప్రజల నుంచి సూచనలు ఆహ్వానం

2లో..

## మెట్రోపై చర్చలు సక్సెస్

**రెండో దశ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్**

**కేంద్రమంత్రులు ఖట్టర్,అశ్విని వైష్ణవ్‌లతో సీఎం రేవంత్ చర్చలు ఫలప్రదం**

**ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి ముఖ్యమంత్రి భేటీ**



న్యూఢిల్లీలోని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలతో సమావేశమైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్‌స్టలెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్‌స్టలెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు మిగతా 2లో..

## అడిగిన వెంటనే అపాయింట్‌మెంట్ ఇప్పించా..

**సీఎం రేవంత్ కోరిక మేరకే కేంద్రమంత్రులను కలిసాం : కిషన్ రెడ్డి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు మిగతా 2లో..



## మమ్ముట్టికి పద్మభూషణ్..

**మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు పద్మశ్రీ**

- ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం
- ప్రధాని మోడీ,ప్రముఖుల హాజరు



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు మిగతా 3లో..

**కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఊహాగానాల వేళ..**



## రాష్ట్రపతితో ప్రధాని భేటీ

'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిసిన మోదీ

3లో..

**మెట్రో పట్టాలు ఎక్కాలంటే**

## మళ్లీ కేసీఆర్ రావాల్సిందే



**2028లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: కేటీఆర్**

**శేరిలింగంపల్లి (జనంసాక్షి):**రేవంత్ రెడ్డి ఎజెండా ఎప్పుడు ఒక్కటే ఉంటది. మెట్రో భూముల ఆయన ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కాం మాత్రం పక్కా ఉంటది. ఆయన కన్నంతా మెట్రో భూముల మీద పడ్డదని బీఆంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. లంకె బిందెల కోసం తిరుగుతా ఉన్నడు. మెట్రో దగ్గర 280 ఎకరాల విలువైన భూములున్నాయి. సుమారు రూ.30 వేల కోట్ల విలువ చేసే భూములు. ఆయన అన్నదమ్ములకో, బావమరిదులతో, అల్లుడికో కట్టబెట్టేందుకే ఆ 280 ఎకరాల విలువైన భూములపై కన్నేసిండు మిగతా 2లో..



**ఇందిరమ్మ రాజ్యమంటూ**

## పేదల ఇళ్ల కూల్చివేత

**ఖమ్మం పర్యటనలో హరీశ్ విమర్శలు**

**ఖమ్మం(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూలగొడుతోందని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ మైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టిస్తుందని తెలి పారు. రెవెన్యూ మంత్రి హ యాంలో పేదల ఇళ్లు లాక్కో వడం దుర్మార్గమని పేర్కొన్నారు. మిగతా 2లో..



## మరో అవినీతి జలగ

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసాల్లో సోదాలు**

**8 ప్లాట్లు, 10 ఎకరాల భూమి గుర్తించిన ఏసీబీ**



2లో..

**ఆయిల్‌పామ్ రైతులకు**

## రక్షణ కల్పించాలి

- దిగుమతి సుంకాన్ని 44% కు పెంచాలి తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి
- పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 % పరిమితి ఎత్తివేయాలి మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంస్పిపై కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వినతి



**న్యూఢిల్లీ,జూన్23(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ మిగతా 3లో..

## గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలి

**కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మంత్రులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ,తుమ్మల నాగేశ్వరావు భేటీ**

**రాష్ట్ర విజ్ఞప్తి మేరకు సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు కృతజ్ఞతలు**

3లో..

# హర్మూజ్ తెరిచే ఉంది

**జలసంధిలో ఒక్కరోజే 1.9కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగింది: ట్రంప్**



**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందంతో హర్మూజ్ జలసంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్ టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని.. ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు."నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ మిగతా 2లో..

**యుద్ధం ముందున్న స్థితికి హర్మూజ్ ఎప్పటికీ**

## తిరిగిరాదు

- జలసంధి నిర్వహణను ఇరానే చూస్తుంది
- ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు

2లో..

## అమెరికా పౌరసత్వం మరింత ప్రియం!



- ఇమిగ్రేషన్ రూల్స్ మరింత కఠిన తరం
- ఫైలింగ్ ఫీజులను 75 % పెంచే యోచన

**ఉక్రెయిన్ ధాటికి రష్యా**

## ఉక్కిరిబిక్కిరి

**వరుస దాడులతో దద్దరిల్లిన మాస్కో**

- చమురు క్షేత్రాలు, కర్మాగారాలే లక్ష్యం దాడులు
- రష్యాలో 'హైవే ఆఫ్ డెత్'.. ఉక్రెయిన్ లాజిస్టిక్స్ లాక్‌డౌన్ వ్యూహం

9లో..



**మీ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి**

## మాపై నిందలా?

**పాక్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పీఓకేలో ఆందోళనలతో పాటు సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోందని మండిపడింది. ఆ మంత్రి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని మిగతా 9లో..

## బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

**కాళీమాత ఆలయంలో వెండి కిరీటం చోరీ**

9లో..

**ధ్రువపు మంచు**

## ఇక కరగదు

**మానవాళి మనుగడకు శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగాలు**

# ఉప్పొంగిన గౌరారం వాగు

- నిలిచిన రాకపోకలు...
- నరకయాతనలో రెండు గ్రామాలు!



**మంగపేట జూన్ 23(జనంసాక్షి) :** మంగపేట మండలంలో సోమవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి గౌరారం వాగు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనివల్ల కొత్తూరు మోట్లగూడెం – బొంబాయిగూడెం గ్రామాల మధ్య ప్రధాన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వాగు అవతలి ఒడ్డున ఉన్న ప్రజలు ఇటువైపు రావడానికి, ఇటువైపు ఉన్నవారు అటువైపు వెళ్ళడానికి వీలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న గౌరారం వాగుపై శాశ్వత వంతెన (బ్రిడ్జి) నిర్మించాలని ఇక్కడి ప్రజలు కొన్నేళ్లుగా కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాగు దాటలేక పాలు, కూరగాయలు, నిత్యావసర సరుకుల రవాణా నిలిచిపోతోంది. అత్యవసర సమయాల్లో గర్భిణీలు, వృద్ధులు, రోగులను ఆసుపత్రికి తరలించాలన్నా వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వరద తగ్గే వరకు వేచి చూడాల్సి వస్తోంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వాగు ఉధృతి వల్ల చదువులకు దూరమవ్వాల్సి వస్తోంది. ప్రతి ఏటా వర్షాలు పడటం, రాకపోకలు బంద్ అవ్వడం మాకు అలవాటైపోయింది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే ప్రజాప్రతినిధులు వంతెన కడిపిస్తామని పెద్ద పెద్ద మాటలు చెబుతారు. గెలిచాక మాత్రం మమ్మల్ని, మా సమస్యను అస్సలు పట్టించుకోరు. అధికారులు, పాలకులు స్పందించి మా కష్టాలు ఎప్పుడు తీరుస్తారో?" అని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా వరదలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన గౌరారం వాగు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కొత్తూరు మోట్లగూడెం, బొంబాయిగూడెం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ఫారెస్ట్ కార్యాలయం ఎదుట పోడు రైతుల ధర్నా

- రైతులకు సంఘీభావం తెలిపి ఫారెస్ట్ అధికారులపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** జిల్లాలో పోడు భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట పోడు రైతులు భారీ ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ధర్నా కేంద్రానికి చేరుకొని రైతులకు సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొని రైతులతో కలిసి నినాదాలు చేస్తూ మా భూములు మాకే కావాలి మేము చనిపోయినా సరే మా భూమిలోనే చస్తాము మేము రైతులం, దేశానికే అన్నం పెట్టే రైతులం మా భూములను లాక్కోవడం కంటే మమ్మల్ని అందరిని ఇక్కడే చెట్లకి ఉరి తీయండి అని ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోడు భూముల సమస్యను గుర్తించి లక్షలాది ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. కేసీఆర్ గారు రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలతో రైతుకు అండగా నిలిచారు అని అన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన, ఆదివాసీ రైతులకు అన్యాయం జరగనివ్వను అని అన్నారు. సర్వే పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని, విత్తనాలు వేసుకునే సీజన్‌లో ఆటంకాలు కలిగించవద్దని అటవీ శాఖ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వందలాది మంది పోడు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతితో ప్రధాని భేటీ..

- 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిసిన మోదీ



**న్యూఢిల్లీ (జనంసాక్షి):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం సమావేశం జరిగింది. కేంద్ర మంత్రివర్గం పునర్వ్యస్థీకరణ ఊహాగానాల వేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం ఫొటోలను రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స' వేదికగా షేర్ చేసింది. కేరళకు చెందిన భాజపా నేత జార్జ్ కురియన్ కేంద్ర సహాయ మంత్రి పదవికి ఈ ఉదయం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తథ్యమన్న ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికితోడు ఇటీవల పలువురు కేంద్రమంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాను దిల్లీ భాజపా అధ్యక్షుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మే నెలలో నియమించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మరింత మంది మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది తమ మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారమ జరుగుతోంది. వివిధ పార్టీల నుంచి భాజపాలోకి, ఎన్డీయేలోకి వచ్చిన వారిని కేబినెట్‌లోకి తీసుకుంటారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ రాష్ట్రపతి భేటీ కావడంతో త్వరలోనే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉండొచ్చన్న సంకేతాలు ఇచ్చినట్లయ్యింది.

# మమ్ముట్టికి పద్మభూషణ్..

- మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ
- ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం
- కార్యక్రమానికి ప్రధాని మోడీ తదితరుల హాజరు

డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేందప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి

- దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి
- తెలంగాణకు తక్షణమే డీఏపీ, యరియా సరఫరా చేయాలి
- మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంస్‌పిపై కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలి
- కేంద్ర మంత్రులను కలిసిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల



ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాల ను అత్యంత సమర్ధవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమావేశాలలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపిలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులది కీలక పాత్ర

- ఉద్యమకారుల గుర్తింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి
- చైర్మన్ కేకే కు వినతి పత్రాన్ని అందించిన టీయుడబ్ల్యూజే



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం నాడు టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావును బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర అవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక-ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేసారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకా రులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. కమిటీ చైర్మన్ కేకే ను కలిసిన వారిలో విరాహత్ అలీతో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎఖజీ) అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### సమగ్రంగా అధ్యయనం చేసి న్యాయం చేస్తాం : కే. కేశవరావు

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, రాజకీయ, రాజకీయేతర రంగాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కె. కేశవరావు టీయుడబ్ల్యూజే బృందంతో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా కోణాల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఉద్యమ సాక్ష్యాలను పరిగణలోకి తీసుకొని, ఆయా రంగాల ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాల నుండి సేకరించిన సమాచార నివేదికలు, ఆయా వర్గాలతో ప్రత్యేక సంప్రదింపులు నిర్వహించి, ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో సీనియర్ పాత్రికేయులతో కూడా కమిటీ సమావేశమై వారి సలహాలు కూడా తీసుకుంటుందని కేశవరావు అన్నారు.

# 5న భువనగిరిలో రాజ్యాధికార సమరభేరీ సభ

- కరీంనగర్ జిల్లాలో రాజ్యాధికార సమరభేరి వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్ (జనంసాక్షి) :** జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణక్క ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజినీకుమార్ యాదవ్ మరియు రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగిపెల్లి అరుణక్క మాట్లాడుతూ, బీసీల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే సభ భువనగిరి రాజ్యాధికార సమరభేరి అని అన్నారు. కరీంనగర్ జిల్లా నుండి కనీసం 5 వేల మంది బీసీ ప్రజలు సభకు తరలివచ్చేలా ప్రతి గ్రామంలో, ప్రతి బస్తీలో విస్తృత ప్రచారం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అఖిల్ పాషా మాట్లాడుతూ, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం అందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని అన్నారు. బహుజన వర్గాల స్వాభిమానాన్ని కాపాడుతూ వారికి అధికార భాగస్వామ్యం కల్పించేందుకు పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. మాధం రజినీకుమార్ యాదవ్ మాట్లాడుతూ, జులై 05న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలవబోతుందని అన్నారు. రాబోయేది బీసీ రాజ్యమేనని, బహుజన వర్గాల పాలనకు భువనగిరి సభ నాంది పలుకుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని స్పష్టం చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో జులై 05న భువనగిరికి తరలివచ్చి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జింక లావణ్య కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, వైస్ ప్రెసిడెంట్ ఇరుగుదుండ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి నాతరి రాధా, మహిళా కార్యదర్శి మహమ్మద్ ఇశ్రత్, మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షద్దీన్ అలీ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకుష్, యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, మహబూబ్ అలీ, టౌన్ ప్రెసిడెంట్ కొత్తకొండ వేణు, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, కొత్తపెల్లి మండల్ అధ్యక్షుడు ఓర్సు రాజు, దండంగుల మోహన్, దండం గులా మురళి, ఓర్స్ కార్తిక్, ఓర్స్ విమల, అమ్మిగళ్ళ కుమార్, కొప్పుల వెంకటేష్, గంగధర మండల్ అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ గుండా సతీష్, చొప్పదండి మండల్ అధ్యక్షుడు దామర అనిల్, కొడిమ్యాల్ మండల్ అధ్యక్షుడు దుబ్బాక అరుణ్, తిమ్మాపూర్ మండల్ అధ్యక్షుడు శివరాత్రి మోహన్, ప్రధాన కార్యదర్శి దురుశెట్టి చందు, చిగురుమామిడి మండల అధ్యక్షుడు బుర్ర అశోక్, కొత్తకొండ శ్రీకాంత్, మొగిలి జలంధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలి

- కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మంత్రులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మల నాగేశ్వరావు భేటీ
- రాష్ట్ర విజ్ఞప్తి మేరకు సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు కృతజ్ఞతలు

**న్యూఢిల్లీ (జనంసాక్షి):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

సంపాదకీయం

# నిద్రలేచిన అన్నా హజారే..!

సమాచార హక్కు చట్టంపై మహారాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సవరణలను వెంటనే ఉపసంహరించుకోకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని అన్నా హజారే హెచ్చరించారు. ఈ హెచ్చరిక వినగానే చాలామందికి ఒక్కసారి 2011 నాటి జ్ఞాపకాలు మెదిలాయి. రాజపథంపై జనసముద్రం, "అన్నా తుమ్ సంఘర్ష్ కరో" నినాదాలు, మీడియా హైప్. అయితే ఇప్పుడు పుట్టిన ప్రశ్న ఒక్కటే.. అన్నా నిజంగా నిద్రలేచారా, లేదా నిద్రపోతున్నట్టు నటిస్తున్న కుంభకర్ణుడు కొంచెం అటూఇటూ కదిలాడా అన్నది సందిగ్ధంగానే ఉంది.

మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో అన్నా హజారే అవినీతి నిర్మూలన పేరుతో ఢిల్లీ రాజపథంపై చేసిన ఉపవాస దీక్ష దేశాన్ని ఒక్కసారి కుదిపేసింది. జన్ లోక్‌పాల్ బిల్లు కావాలని లక్షలాది మంది వీధుల్లోకి వచ్చారు. మీడియా గంటల తరబడి లైవ్ కవరేజ్ ఇచ్చింది. సోషల్ మీడియా మొత్తం అన్నాతో నిండిపోయింది. మధ్యతరగతి యువత మొట్టమొదటిసారి రాజకీయ చైతన్యంతో వీధుల్లోకొచ్చింది. కానీ ఆ ఉద్యమం వెనక అసలు లక్ష్యం లోక్‌పాల్ కాదని, రాజకీయ అధికార మార్పిడికి అది కేవలం వేదిక మాత్రమేనని రాను రాను స్పష్టమైంది. అన్నా అనుకున్న సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు పన్నెండేళ్లపాటు ఆయన పూర్తిగా మౌనంలో మునిగిపోయారు. లోక్‌పాల్ బిల్లు అమలైందా లేదా అని అడిగేవారే కరువయ్యారు. అన్నా మాట్లాడలేదు, మీడియా అడగలేదు, ప్రజలు మర్చిపోయారు.

**రైతు ఆందోళన దేశాన్ని కదిలించినప్పుడు కూడా అన్నా పాత్ర అత్యంత నిరాశగా ముగిసింది. వేలాది మంది రైతులు చలికాలంలో ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి గుడారాలు వేసుకొని ఉన్నప్పుడు, నల్ల చట్టాలను రద్దు చేయకపోతే దీక్షకు దిగుతానని అన్నా ప్రకటించారు. రైతులు ఒక్కసారి ఆశతో చూశారు. కానీ కొద్దిరోజులకే ఆ గొంతు సన్నగిల్లిపోయింది.**

చివరకు ఆ చట్టాలకే పరోక్షంగా మద్దతు పలికినట్టు వ్యవహరించారు. అన్నాను విశ్వసించి వెంటబడిన రైతాంగం మోసపోయిన భావనతో మిగిలిపోయింది. నమ్మకం ఒకసారి పోతే తిరిగి రావడం కష్టమని ఆయన అర్థం చేసుకోలేదా అన్న సందేహం అందరిలో మిగిలిపోయింది. ఇప్పుడు ఆర్టీఐ సవరణలపై గొంతు విప్పడం సాధుకారణమైనదే. మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 12న చేసిన సవరణలు ఆర్టీఐ చట్టం 2005 స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, పారదర్శకతను దెబ్బతీస్తున్నాయని ఆయన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్టీఐ అనేది ఆదాయార్జన చట్టం కాదు, అది ప్రజాస్వామ్యపు వెన్నెముక అన్న ఆయన మాటలు అక్షరాలా నిజమే. ఫీజులు పెంచడం, సమాచారం ఇవ్వని అధికారులకు శిక్షలు తగ్గించడం, వివరణ లేకుండా ఫీజులు పెంచే అధికారాన్ని సర్కారుకు కట్టబెట్టడం–ఇవన్నీ పారదర్శకతను నీరుగార్చే చర్యలే. పైగా ఒకవేళ ఫీజు పెంచితే సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరించే అధికారుల పెనాల్టీలు కూడా పెంచాలని ఆయన చేసిన సూచన న్యాయమైనదే. కానీ ప్రశ్న సిద్ధాంతానిది కాదు, విశ్వసనీయతానిది.

**పన్నెండేళ్ల కుంభకర్ణ నిద్ర తర్వాత వచ్చిన హెచ్చరికను సమాజం ఏ కళ్ళతో చూడాలి? ఒకప్పుడు అన్నా పేరు చెప్పగానే దేశం స్పందించేది. ఇప్పుడు అదే పేరు చెప్పినప్పుడు ప్రజలు ఆగి ఆలోచిస్తున్నారు. సందర్భాన్ని బట్టి మేల్కొనే నాయకుడు నిద్రలేచినా నిద్రపోతున్నా తేడా ఏముంటుంది అన్న సంశయం సహజమైనదే.**

ఒక నాయకుని విశ్వసనీయత అతని మాటల్లో కాదు, అతని నిరంతర చర్యల్లో నిరూపితమవుతుంది. అది లేనప్పుడు దీక్ష బెదిరింపుగా మారుతుందే తప్ప ఉద్యమంగా రూపుదాల్చదు. అన్నా ఇప్పుడు చేసే దీక్ష ఫలిస్తుందో లేదో తెలియదు గానీ, కోల్పోయిన నైతిక విశ్వాసాన్ని తిరిగి పొందడం మాత్రం అంత సులభం కాదు. ప్రజలు ఒక నాయకుడిని ఒకసారి పరీక్షిస్తారు, రెండోసారి జాగ్రత్తపడతారు, మూడోసారి పట్టించుకోరు. అన్నా ఇప్పుడు ఏ దశలో ఉన్నారో ఆయనే ఆలోచించుకోవాలి. ఆర్టీఐ చట్టం బతికి ఉండాలి. కానీ దానికోసం పోరాడే నాయకుడు కూడా నైతికంగా బతికి ఉండాలి.

# సినుకమ్మా,వాన సినుకమ్మా.. ఒక్కసారి వచ్చిపోవమ్మా..!



*భారత వాతావరణ శాఖ వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.భారతదేశ వార్షిక వర్షపాతంలో 70 శాతానికి పైగా వాటా నైరుతి రుతు పవనాలదే.*

దేశవ్యాప్తంగా రైతాంగాన్ని, సామాన్య ప్రజలను ఊరించిన నైరుతి రుతుపవనాలు అడుగుపెడుతూనే ముఖం చాటేసాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ 1వ తేదీన కేరళను తాకాల్సిన రుతుపవనాలు.. ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా జూన్ 4న ప్రవేశించాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసిన దానికంటే ఇది ఐదు రోజులు ఆలస్యం. అయితే, కేరళలో ప్రవేశించిన మొదటి వారంలో దేశంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ, ఆ తర్వాత వీటి గమనం పూర్తిగా మందగించింది. రుతుపవనాలు ఇలా సుదీర్ఘంగా బ్రేక్ తీసుకోవడం ఇప్పుడు అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ శాఖ చెప్పినట్లే ఇప్పటివరకు వర్షాల జాడ లేక రైతులు అల్లాడి పోతున్నారు. జూన్ చివరివారం వచ్చినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా పెద్ద వానలు కురవలేదు.ఇదే పరిస్థితి కొనసాగితే అసలు ఈ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారనున్నది. దీంతో రైతులు అటు వరి నారుమడులు సిద్ధం చేయాలా, లేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలా.. అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతు న్నారు. రాష్ట్రంలో 1.34.కోట్ల ఎకరాల సాగు ప్రభుత్వం అంచనా వేసినప్పటికీ ఈ నెలాఖరు వరకు సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే స్వల్పకాలిక వరి వంగడాలను విత్తుకోవాలని, లేదంటే ప్రత్యామ్నయ పంటలనే ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులకు సూచిస్తున్నారు.తెలంగాణలో జూన్ ముగింపు దశకు వస్తున్నా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలకపోవడం,ఎల్‌నినో ప్రభావం కారణంగా చాలా జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తీవ్ర లోటు వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ (వానాకాలం) సాగు పనులు ప్రశ్నార్థకంగా మారి, అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా, వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. జూన్ ప్రారంభంలో కురిసిన కొద్దిపాటి వర్షాలతో సాగుకు సిద్ధమైన అన్నదాతలకు ఇప్పుడు వర్షాల జాడ లేకపోవడంతో విల విల లాడుతున్నారు. ఈసారి పునాస కలిసి వస్తుందనే ఆశతో సాగు మొదలుపెట్టిన రైతులకు ఆదిలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. రోహిణి కార్తిలో వర్షాలు కురుస్తాయని ఆశపడ్డ రైతన్నకు నిరాశనే మిగిలింది. మెరుపులు,మబ్బులతో మురిపించి వచ్చిన వర్షాలు, ఊరించి ఊసూరుమనిపించాయి. ఇదే అదనుగా వరుణుడు ముఖం చాటేయటంతో 43డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎండలు దంచికొడుతు న్నాయి. అయితే ఎప్పటి లాగా ముందస్తు తొలకరి జల్లులకు విత్తనాలు విత్తుకున్న అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మొలకెత్తని పత్తి విత్తనాల స్థానంలో మళ్లీ విత్తుకునేందుకు ఎదిరిచూస్తున్నారు. నీళ్ల ఆధారంగా విత్తనం వేసిన మొలకలు ఎండిపోకుండా నీళ్ల పోసి కాపాడుకునేందుకు బిందెలతో ,కాల్వలతో ప్రయత్నిస్తున్నారు. రోజువారీగా పగలు ఎండలు కాస్తున్నప్పటికీ, సాయంత్రం పూట ఆకాశం మబ్బులు పడుతుండటంతో వర్షం కురుస్తుందని ఆశగా ఆకాశంవైపు రైతన్నలు చూస్తున్నారు. కానీ వరుణుడు ముఖం చాటేయడానికి బంగాళాఖాతంలో ఎలాంటి బలమైన వాతావరణ వ్యవస్థ ఏర్పడకపోవడమే రుతుపవనాల గమనం ఆగిపోవడానికి ప్రధాన కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది వరి 67.04 లక్షల ఎకరాలు,పత్తి 45.85 లక్షల ఎకరాల్లో వేసి రికార్డు సృష్టించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వరి,పత్తికి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండడంతో 90శాతం వరి,పత్తికే మొగ్గు చూపి, జాడలేని వర్షాల కోసం అన్నదాత ఆకాశం వైపు చూస్తూ కంటిమీద కునుకులేని కాలమిది.

రాష్ట్రవ్యాప్తంగా 400 మండలాల్లో ఇప్పటి వరకు చుక్క వర్షం కురవలేదు. హైదరాబాద్, సైబరాబాద్,మల్కాజిగిరి కమిషనరేట్లు మినహా 155 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.మరోవైపు తీవ్రమైన వేసవి, రుతుపవనాలు సరిగ్గా లేకపోవడంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు మొదలయ్యాయి.యేటా ఈ సమయం వరకు నారు మడులు,దుక్కుల్లో విత్తనం పెట్టి సంతోషంగా ఉండే రైతులు మబ్బులకేసి ఎదురు చూపులు తప్పడంలేదు. జాడలేని వర్షాలకు దుక్కి దున్నే రైతన్నలు దుఃఖాన్ని మింగుతున్నారు. పునాస పంటలకు ఊతం ఇచ్చే వర్షాలు మబ్బుల చాటున దాగి ఉండడంతో వ్యవసాయ పనులు ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనుకకు అన్నమాదిరిగా సాగుతున్నాయి. భూమినే నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న రైతన్నలు వరుణదేవుడు రాక కోసం ఎదిరి చూస్తున్నారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.వర్షా భావ పరిస్థితులు, యూరియా కొరత, ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో సమస్యల నేపథ్యంలో వరి,మొక్కజొన్న,పత్తి,మిర్చి పంటలు కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవడం మేలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు చెప్పడంతో రైతులు అటువైపుగా ఆలోచిస్తున్నారు. వానాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా ఒక్క గట్టి వర్షం పడకపోవడంతో రైతులు తండ్లాట మొదలైంది. జూన్ 1నుంచి 20వరకు నమోదైన వర్షపాతం సాధారణ వర్షపాతం కంటే తక్కువగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జూన్ ద్వితీయార్థంలో వాతావరణ పరిస్థితులు రుతుపవనాలకు అనుకూలంగా మారుతాయని, కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పెరిగే అవకాశం ఉందని ఫోర్‌కాస్టర్లు అంచనా వేయడం గమనార్హం.

రైతులు వర్షాల కోసం నిరీక్షణ చేస్తూనే మృగశిర కార్తె ప్రవేశంలో పడిన చిరు జల్లులను నమ్ముకుని చాలా మంది రైతులు పత్తి, వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. కానీ ఆ తర్వాత వాన జాడ లేకపోవడంతో విత్తనాలు భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. వర్షాలు పడక విత్తనాలు మొలకెత్తకపోవడం లేదా ఎండిపోవడంతో రైతులు మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఇది రైతులపై రెండింతల పెట్టుబడి భారాన్ని మోపుతోంది. వర్షాల లేమిడి కారణంగా చెరువులు, కుంటలు, బావుల్లో భూగర్భ జలాలు ఇంకా పెరగలేదు. దీంతో వరి సాగుకు అవసరమైన నీరు అందుబాటులో లేక ప్రత్యామ్నాయ పంటల వైపు చూడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వరి లేదా పత్తిపైనే ఆధారపడకుండా కంది, పెసర, మినుము, మొక్కజొన్న లాంటి స్వల్పకాలిక, తక్కువ నీటిని తీసుకునే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరోవైపు భారత వాతావరణ శాఖ వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.భారతదేశ వార్షిక వర్షపాతంలో 70 శాతానికి పైగా వాటా నైరుతి రుతుపవనాలదే. జూన్ మొదటి వారంలో చురుగ్గా సాగిన వీటి ప్రయాణం, ఆ తర్వాత దేశవ్యాప్తంగా బలహీన పడటంతో అక్కడికక్కడే స్తంభించిపోయింది. "ప్రస్తుతం బంగాళాఖాతంలో ఎలాంటి వాతావరణ వ్యవస్థ లేదు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లోకి రుతుపవనాలు ముందుకు దూసుకెళ్లాలన్నా, అరేబియా సముద్రం మీదుగా పశ్చిమ తీరం వైపు రుతుపవనాలను లాగాలన్నా.. బంగాళాఖాతంలో కచ్చితంగా ఒక అల్పపీడనం లేదా ద్రోణి ఏర్పడాల్సి ఉంటుంది. ఇక మొదలైన ఆరుద్ర కార్తె వట్టిగనే పోతే అన్నదాతల ఆదెరువు పోతుందని ఏ భరోసా రైతన్నను కాపాడలేదని దిగులుగా సినుకమ్మా వాన సినుకమ్మా.. ఒక్కసారి వచ్చిపోవమ్మా అంటూ ప్రాదేవపడుతున్నారు.



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్ : 9866255355

# 2050వైపు భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రయాణం!

నేటి ఆధునిక ప్రపంచంలో డబ్బు మానవ జీవితంలో అత్యంత అవసరమైన సాధనంగా మారింది. ఆహారం, విద్య, వైద్యం, నివాసం, ఉపాధి, భద్రత వంటి ప్రతి అవసరానికీ డబ్బు కీలకంగా మారిన వాస్తవాన్ని ఎవరూ ఖండించలేరు. అయితే ఒకప్పుడు జీవితాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడిన డబ్బు, నేడు అనేక కుటుంబాల్లో సంబంధాలను నియంత్రించే శక్తిగా మారుతోంది. ప్రేమ, ఆప్యాయత, గౌరవం, పరస్పర సహకారం, త్యాగం వంటి కుటుంబ విలువలను క్రమంగా ఆర్థిక ప్రయోజనాలు అధిగమిస్తున్నాయి. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప సామాజిక నిర్మాణం. కానీ అదే వ్యవస్థ ప్రస్తుతం ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన మార్పులను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు తరతరాలుగా ఒకే ఇంట్లో 15 నుంచి 20 మంది కలిసి జీవించిన కుటుంబాలు నేడు చిన్న చిన్న అణు కుటుంబాలుగా విడిపోయాయి. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాల స్థానంలో ఆస్తి పంపకాలు, డబ్బు లావాదేవీలు, వారసత్వ హక్కులు, వ్యక్తిగత ఆదాయాలు ప్రధాన చర్చాంశాలుగా మారాయి. ఈ పరిస్థితి కొనసాగితే 2050 నాటికి భారతీయ కుటుంబ వ్యవస్థ ఎటువంటి రూపాన్ని సంతరించుకుంటుందనే ప్రశ్న సమాజ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, మానసిక నిపుణులు, విధాన రూపకర్తలను తీవ్రంగా ఆలోచింపజేస్తోంది.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ జీవన విధానానికి మూలస్తంభంగా ఉండేది. కుటుంబ పెద్ద నిర్ణయం అందరికీ గౌరవప్రదంగా ఉండేది. సంపాదించిన ఆదాయాన్ని అందరూ కలిసి వినియోగించు కునేవారు. పిల్లల పెంపకం నుంచి వృద్ధుల సంరక్షణ వరకు ప్రతి బాధ్యతను కుటుంబ సభ్యులు పంచుకునేవారు. వ్యవసాయ కుటుంబాల్లో పని కూడా సామూహికంగా జరిగేది. పండుగలు, వివాహాలు, శుభకార్యాలు, కష్టకాలాలు అన్నింటిలో కుటుంబ సభ్యులందరూ ఒకరికొకరు అండగా నిలిచేవారు. కుటుంబం అనేది కేవలం రక్త సంబంధాల సమూహం మాత్రమే కాదు; అది భావోద్వేగ భద్రతను, సామాజిక రక్షణను, ఆర్థిక స్థిరత్వాన్ని, విలువల బోధనను అందించే గొప్ప వ్యవస్థ. అయితే 1991 తర్వాత ఆర్థిక సరళీకరణ, వేగవంతమైన పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, విదేశీ అవకాశాల పెరుగుదల, వినియోగవాద సంస్కృతి ప్రభావంతో ఈ నిర్మాణంలో వేగంగా మార్పులు చోటుచేసుకున్నాయి.

భారతదేశంలో గత 40 సంవత్సరాలుగా కుటుంబ నిర్మాణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అణు కుటుంబాల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. ఒకప్పుడు ఒకే ఇంట్లో మూడు తరాలు నివసించేవి. నేడు భార్య, భర్త, ఒకటి లేదా ఇద్దరు పిల్లలతో కూడిన కుటుంబాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ఒక నగరం నుంచి మరో నగరానికి, ఒక దేశం నుంచి మరో దేశానికి వలసలు పెరగడం వల్ల తల్లిదండ్రులు గ్రామాల్లో ఒంటరిగా మిగిలిపోతున్నారు. కుటుంబ సభ్యులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే కలుసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సాంకేతికంగా అనుసంధానం పెరిగినా, భావోద్వేగ అనుబంధం తగ్గుతున్నదనే అభిప్రాయం అనేక సామాజిక అధ్యయనాల్లో వ్యక్తమవుతోంది. నేటి కుటుంబాల్లో ఎక్కువ గొడవలకు ప్రధాన కారణాల్లో డబ్బు ఒకటి. భార్యాభర్తల మధ్య ఆదాయ వ్యత్యాసాలు, ఖర్చుల నిర్వహణ, అప్పులు, ఆస్తుల కొనుగోలు, పిల్లల విద్య ఖర్చులు, వృద్ధుల వైద్య ఖర్చులు, వారసత్వ పంపకాలు వంటి అంశాలపై విభేదాలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు కుటుంబ గౌరవం కోసం రాజీపడే సంస్కృతి ఉండేది. ఇప్పుడు చట్టపరమైన పోరాటాలు పెరుగుతున్నాయి. సివిల్ కోర్టుల్లో నమోదవుతున్న కుటుంబ ఆస్తి వివాదాలు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా భూముల విలువలు భారీగా పెరగడంతో సోదరుల మధ్య వివాదాలు తీవ్రమవుతు న్నాయి. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు కూడా ఆస్తి కారణంగా పిల్లల మధ్య విభజనకు గురవుతున్నారు.

2.డబ్బు ప్రభావం కేవలం ఆస్తి వివాదాలకే పరిమితం కావడం లేదు. కుటుంబ సభ్యుల మధ్య గౌరవం కూడా చాలాసార్లు ఆర్థిక స్థితిని బట్టి నిర్ణయించబడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కువ సంపాదించే వ్యక్తికి కుటుంబ నిర్ణయాల్లో అధిక ప్రాధాన్యం లభిస్తుండగా, తక్కువ ఆదాయం ఉన్న సభ్యుల అభిప్రాయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఒకప్పుడు వయస్సు, అనుభవం, జ్ఞానం, సంస్కారం కుటుంబంలో గౌరవానికి ప్రమాణాలుగా ఉండేవి. నేడు ఆదాయం, ఆస్తి, ఉద్యోగ హోదా, సామాజిక ప్రతిష్ఠ ప్రధాన ప్రమాణాలుగా మారుతున్నాయి. ఈ మార్పు కుటుంబ సమానత్వాన్ని దెబ్బ తీస్తోంది. కుటుంబ బంధాలు ఆర్థిక లావాదేవీలుగా మారితే పరస్పర విశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. ప్రపంచీకరణ ప్రభావం కూడా కుటుంబ వ్యవస్థపై గణనీయంగా పడుతోంది. బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు, విదేశీ విద్య, అంతర్జాతీయ వలసలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ కారణంగా యువత కుటుంబాల నుంచి దూరమవుతోంది. వృత్తి జీవితంలో ఎదగాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు, సోదరులు, బంధువుల నుంచి దూరంగా నివసించడం సాధారణంగా మారింది. ఇది వ్యక్తిగత అభివృద్ధికి ఉపయోగ పడుతున్నప్పటికీ, కుటుంబ అనుబంధాలను బలహీనపరుస్తోంది. అనేక సందర్భాల్లో వృద్ధ తల్లిదండ్రులు ఒంటరితనంతో జీవించాల్సి వస్తోంది. పిల్లలతో ఒకే ఇంట్లో ఉండే అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయి. వృద్ధుల పరిస్థితి ప్రత్యేకంగా ఆందోళన కలిగిస్తోంది. భారతదేశంలో 2026 నాటికి 60 సంవత్సరాలు దాటిన వారి సంఖ్య సుమారు 170 మిలియన్లకు చేరుకున్నట్లు వివిధ జనాభా అధ్యయనాలు సూచిస్తున్నాయి. 2050 నాటికి ఈ సంఖ్య 300 మిలియన్లకు పైగా చేరే అవకాశం ఉందని జనాభా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద వృద్ధ జనాభాకు కుటుంబ మద్దతు తగ్గితే వృద్ధాశ్రమాలు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతా వ్యవస్థలపై భారీ భారం పడే అవకాశం ఉంది. ఒకప్పుడు పిల్లలను పెంచిన తల్లిదండ్రులు చివరి దశలో పిల్లల ప్రేమకు దూరమైతే అది కేవలం కుటుంబ సమస్య కాదు; దేశ సామాజిక నిర్మాణానికే సవాలుగా మారుతుంది. డబ్బు ప్రభావం పిల్లల పెంపకంపైనా స్పష్టంగా కనిపిస్తోంది. ఇద్దరు తల్లిదండ్రులు ఉద్యోగాల్లో నిమగ్నమవడంతో పిల్లలతో గడిపే సమయం తగ్గుతోంది. ఖరీదైన బొమ్మలు, గాడ్జెట్లు, అంతర్జాతీయ పాఠశాలలు, విలాసవంతమైన జీవనశైలి ఇవ్వగలుగుతున్నా, కుటుంబ సభ్యులతో కలిసి గడిపే సమయాన్ని మాత్రం కొనలేకపోతున్నారు. తాతలు, అమ్మమ్మలు చెప్పే జీవిత అనుభవాలు, కుటుంబ సంప్రదాయాలు, విలువల బోధన క్రమంగా తగ్గిపోతున్నాయి. ఫలితంగా కొత్త తరంలో వ్యక్తిగత స్వార్థం పెరగడం, సహనం తగ్గడం, సంబంధాల విలువను అర్థం చేసుకోలేకపోవడం వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా ఈ సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ఇతరుల సంపద, విలాసవంతమైన జీవనశైలి, ఖరీదైన వస్తువులు, విదేశీ పర్యటనలు నిరంతరం కనిపిస్తుండటంతో పోలికల సంస్కృతి వేగంగా పెరుగుతోంది. "మన కుటుంబం కూడా అలానే ఉండాలి" అనే ఒత్తిడి ఆర్థిక భారాన్ని పెంచుతోంది. అప్పులు చేయడం, అవసరం లేని ఖర్చులు చేయడం, కుటుంబ సభ్యుల మధ్య పరస్పర నిందారోపణలు పెరగడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ఆదాయం కంటే ప్రతిష్ఠకు ప్రాధాన్యం పెరగడం అనేక కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోంది. వివాహ వ్యవస్థలో కూడా డబ్బు ప్రాముఖ్యత గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు వ్యక్తిత్వం, కుటుంబ విలువలు, పరస్పర గౌరవం ప్రధాన ప్రమాణాలుగా ఉండేవి. ఇప్పుడు జీతం, ఆస్తులు, ఉద్యోగ హోదా, విదేశీ అవకాశాలు వంటి అంశాలు వివాహ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివాహానంతరం కూడా ఆదాయాల నిర్వహణ, ఆర్థిక స్వాతంత్ర్యం, కుటుంబ ఖర్చుల పంపకం, తల్లిదండ్రుల బాధ్యత వంటి అంశాలపై విభేదాలు పెరుగు తున్నాయి. ఈ పరిస్థితి విడాకుల సంఖ్య పెరగడానికి పరోక్ష కారణంగా కూడా మారుతోందని అనేక కుటుంబ సలహాదారులు అభిప్రాయపడుతున్నారు.

3.2050 నాటికి భారతీయ కుటుంబ వ్యవస్థ ఎలా ఉండవచ్చనే అంశాన్ని పరిశీలిస్తే కొన్ని ఆందోళనకరమైన ధోరణులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే భారతదేశంలో అణు కుటుంబాల శాతం 80%–85% వరకు చేరే అవకాశం ఉందని అనేక సామాజిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు చాలా



అరుదుగా మాత్రమే కనిపించే పరిస్థితి ఏర్పడవచ్చు. ఒకే ఇంట్లో మూడు తరాలు కలిసి జీవించడం ప్రత్యేక సందర్భంగా మారే అవకాశం ఉంది. వృద్ధ తల్లిదండ్రులు ఒకచోట, ఉద్యోగాల కోసం పిల్లలు మరోచోట, విదేశాల్లో మనవలు మరోచోట నివసించే కుటుంబాలు సాధారణంగా మారవచ్చు. కుటుంబ సమావేశాలు సంవత్సరానికి ఒకటి లేదా రెండు సందర్భాలకు మాత్రమే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

ఆర్థిక అసమానతలు కూడా కుటుంబ బంధాలను ప్రభావితం చేసే ప్రధాన అంశంగా మారవచ్చు. ఒకే కుటుంబంలో కొంతమంది అత్యధిక ఆదాయం సంపాదిస్తుండగా, మరికొందరు ఆర్థికంగా వెనుకబడితే అసూయ, అపార్థాలు, దూరాలు పెరిగే అవకాశం ఉంది. డబ్బు ఆధారంగా కుటుంబ సభ్యులను అంచనా వేసే ధోరణి మరింత బలపడితే ప్రేమ, గౌరవం, పరస్పర విశ్వాసం వంటి విలువలు క్రమంగా బలహీనపడవచ్చు. వారసత్వ ఆస్తుల విలువలు భారీగా పెరగడం వల్ల భూములు, ఇళ్లు, వ్యాపారాలపై వివాదాలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ వల్ల ఉద్యోగాల స్వరూపం కూడా మారుతోంది. 2050 నాటికి సంప్రదాయ ఉద్యోగాల్లో గణనీయమైన మార్పులు రావచ్చు. ఆదాయాల్లో అస్థిరత పెరిగితే కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి అధికమవుతుంది. ఈ ఒత్తిడి భార్యాభర్తల సంబంధాలు, పిల్లల పెంపకం, వృద్ధుల సంరక్షణపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. డబ్బు కోసం ఎక్కువ సమయం పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడితే కుటుంబ సభ్యులతో గడిపే సమయం మరింత తగ్గిపోతుంది.

మానసిక ఆరోగ్య సమస్యలు కూడా భవిష్యత్తులో ప్రధాన సవాలుగా మారవచ్చు. కుటుంబ మద్దతు తగ్గడం వల్ల ఒంటరితనం, ఆందోళన, నిరాశ, భావోద్వేగ అస్థిరత వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే మానసిక ఆరోగ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యంత కీలకమైన ప్రజారోగ్య సమస్యగా పేర్కొంటోంది. కుటుంబ అనుబంధాలు బలహీనపడితే ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, ఒంటరిగా నివసించే ఉద్యోగులు అధిక ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. అయితే భవిష్యత్తు పూర్తిగా ప్రతికూలంగా ఉండాల్సిన అవసరం లేదు. కుటుంబ విలువలను కాపాడే దిశగా సమాజం చైతన్యవంతం అయితే పరిస్థితిని మార్చడం సాధ్యమే. పాఠశాలస్థాయి నుంచే నైతిక విలువలు, కుటుంబ బాధ్యతలు, వృద్ధుల పట్ల గౌరవం, పరస్పర సహకారం వంటి అంశాలను బోధించడం అవసరం. కుటుంబ సభ్యులు వారానికి కనీసం ఒక రోజు కలిసి గడపడం, కుటుంబ సమావేశాలను నిర్వహించడం, ఆస్తి విషయాల్లో పారదర్శకత పాటించడం, ముందుగానే చట్టబద్ధమైన వారసత్వ ప్రణాళికలు రూపొందించడం ద్వారా అనేక వివాదాలను నివారించవచ్చు.

ప్రభుత్వం కూడా కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. వృద్ధుల సంక్షేమ పథకాలు, కుటుంబ సలహా కేంద్రాలు, మానసిక ఆరోగ్య సేవలు, ఉద్యోగులకు కుటుంబ సమయాన్ని ప్రోత్సహించే విధానాలు, మహిళలకు పని––కుటుంబ సమతుల్యత కల్పించే చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు వంటి కార్యక్రమాలు కుటుంబ బంధాలను బలపరచడంలో సహాయపడతాయి. సమాజ సేవా సంస్థలు, విద్యాసంస్థలు, మత సంస్థలు కూడా కుటుంబ విలువల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలి. చివరికి ఒక విషయాన్ని ప్రతి మనిషి గుర్తుంచుకోవాలి. డబ్బు జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చగలదు, కానీ ప్రేమను కొనలేదు. ఆస్తిని సంపాదించవచ్చు, కానీ అనుబంధాన్ని కొనుగోలు చేయలేం. విలాస వంతమైన ఇంటిని నిర్మించవచ్చు, కానీ ఆ ఇంటిని కుటుంబంగా మార్చేది పరస్పర ప్రేమ మాత్రమే. తల్లిదండ్రుల ఆశీర్వాదం, సోదరుల ఆప్యాయత, పిల్లల అనురాగం, జీవిత భాగస్వామి విశ్వాసం, బంధువుల సహకారం ఇవన్నీ డబ్బుతో కొలవలేని అమూల్యమైన సంపదలు. 2050 నాటికి భారతదేశం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదిగినా, కుటుంబ బంధాలు బలహీనపడితే ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. అందువల్ల డబ్బు మన జీవితానికి అవసరమైన సాధనంగా ఉండాలి తప్ప కుటుంబ సంబంధాలను శాసించే అధిపతిగా మారకూడదు. కుటుంబ విలువలు, మానవత్వం, పరస్పర గౌరవం, బాధ్యతలను కాపాడినప్పుడే భారతీయ కుటుంబ వ్యవస్థ తన గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా సజీవంగా అందించగలదు.

4.భారతీయ తత్వశాస్త్రం ఎప్పటి నుంచో "ధనం ధర్మానికి అనుసరించాలి, ధర్మం ధనానికి బానిస కాకూడదు" అనే సందేశాన్ని అందిస్తోంది. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి మహాగ్రంథాలు సంపదను తిరస్కరించలేదు. అయితే సంపదను సద్వినియోగం చేయాలని, కుటుంబ బంధాలను ధనంతో తూకం వేయకూడదని స్పష్టంగా బోధించాయి. చరిత్రను పరిశీలిస్తే ఆస్తి కోసం అన్నదమ్ములు శత్రువులుగా మారిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. అదే సమయంలో త్యాగం, పరస్పర సహకారం, కుటుంబ ఐక్యతతో తరతరాల పాటు ఆదర్శంగా నిలిచిన కుటుంబాల చరిత్ర కూడా కనిపిస్తుంది. ఈ రెండు మార్గాల్లో ఏది ఎంచుకోవాలనేది ప్రతి కుటుంబం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం 2050 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో అగ్రస్థానాలకు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. తలసరి ఆదాయం ప్రస్తుతం ఉన్న స్థాయి కంటే అనేక రెట్లు పెరిగే అవకాశం ఉంది. మధ్యతరగతి జనాభా గణనీయంగా విస్తరించవచ్చు. డిజిటల్ లావాదేవీలు దాదాపు సంపూర్ణ స్థాయికి చేరవచ్చు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఆటోమేషన్, డిజిటల్ సేవలు కొత్త అవకాశాలను సృష్టించవచ్చు.

భవిష్యత్ భారతదేశంలో కుటుంబ సంబంధాలను కాపాడుకోవడానికి ప్రతి కుటుంబం కొన్ని మౌలిక సూత్రాలను పాటించాల్సిన అవసరం ఉంది. ఆస్తి విషయాల్లో పారదర్శకత ఉండాలి. తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే వారసత్వ ప్రణాళికను స్పష్టంగా రూపొందించాలి. కుటుంబ సభ్యుల మధ్య నిరంతర సంభాషణ కొనసాగాలి. వారానికి ఒకరోజు అయినా అందరూ కలిసి భోజనం చేయడం, నెలకు ఒకసారి కుటుంబ సమావేశం నిర్వహించడం, వృద్ధుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, పిల్లలకు కుటుంబ చరిత్రను చెప్పడం, కుటుంబ సంప్రదాయాలను కొనసాగించడం వంటి చిన్న చిన్న చర్యలు కూడా పెద్ద మార్పును తీసుకురాగలవు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, సంబంధాలను నిలబెట్టుకోవడం అంతకంటే ముఖ్యమనే అవగాహన ప్రతి తరంలో పెరగాలి. విద్యా వ్యవస్థలో కూడా కుటుంబ విలువలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అంతిమంగా చెప్పాలంటే, 2050 భారతదేశం రెండు దారుల్లో ఏదో ఒక దారిని ఎంచుకోబోతోంది. ఒక దారి అపారమైన సంపదతో కూడిన ఒంటరి జీవితాల వైపు తీసుకెళ్తుంది. మరో దారి ఆర్థిక అభివృద్ధితో పాటు కుటుంబ అనుబంధాలు, మానవీయ విలువలు, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యతను కాపాడే నాగరిక సమాజంవైపు నడిపిస్తుంది. ఈ ఎంపిక ప్రభుత్వాల చేతుల్లో మాత్రమే లేదు; ప్రతి తల్లిదండ్రి, ప్రతి యువకుడు, ప్రతి కుటుంబ సభ్యుడు తీసుకునే చిన్న చిన్న నిర్ణయాల సమాహారమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. బ్యాంకు ఖాతాలోని సున్నాలు మనిషి విలువను నిర్ణయించవు. కష్టకాలంలో చేయి పట్టే కుటుంబ సభ్యులే నిజమైన సంపద. ఆస్తి తరాలకు సంక్రమించవచ్చు, కానీ ప్రేమను మాత్రం ప్రతి తరం కొత్తగా నిర్మించుకోవాలి. డబ్బు సంపాదిం చడం విజయం కావచ్చు; కుటుంబాన్ని కాపాడుకో వడం మాత్రం జీవిత సార్థకత. భారతీయ కుటుంబ వ్యవస్థ ఈ సత్యాన్ని మళ్లీ గుర్తు చేసుకున్న రోజే అభివృద్ధి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- యువత ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
- ఎంపీ ఈటెల రాజేందర్
- ఘనంగా బీజేవైఎం "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్"

**ముషీరాబాద్, జూన్ 23 (జనం సాక్షి) :** వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్ లో భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే నేతృత్వంలో "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి లు పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ




తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ ఉందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. నూతన విద్యా విధానం, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, ముద్ర యోజన వంటి పథకాల ద్వారా అనేక మంది యువత పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారని తెలిపారు. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ద్వారా గ్రామీణ యువతకు కూడా విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, సాంకేతికతను వినియోగించుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని, సామాజిక సేవా భావన, నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే మాట్లాడుతూ "నమో జెన్ జెడ్ కాన్క్లేవ్" లక్ష్యం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించడమేనన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. హరీశ్వర్ రెడ్డి, మల్కా యశస్వి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సందీప్ గౌడ్, నితిన్ నందకర్, అనితా రెడ్డి, శరత్ చంద్ర, సాయినాథ్, రాష్ట్ర కార్యదర్శులు శివచంద్రగిరి, వరప్రసాద్ రెడ్డి, అరవింద్ రెడ్డి, హరిప్రసాద్, ప్రదీప్ రావు, ఝాన్సీ, కోశాధికారి నరేన్ దేశ్‌పాండేతో పాటు పలువురు రాష్ట్ర పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో గాంధీనగర్ ఎస్ఐ

- స్టేషన్ బెయిల్ కోసం రూ.50 వేల లంచం



**సికింద్రాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్ఇన్‌స్పెక్టర్ వి. నర్సింహులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో చిక్కారు. స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు భవిష్యత్తులో వేధింపులకు గురి చేయబోనని హామీ ఇస్తూ ఫిర్యాదుదారుని నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఎస్ఐ నర్సింహులు మొత్తం రూ.1 లక్ష లంచం కోరగా, అందులో భాగంగా రూ.50 వేల నగదును స్వీకరిస్తున్న సమయంలో మంగళవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో హైదరాబాద్ సిటీ రేంజ్-1 ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచంగా స్వీకరించిన రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడి, అక్రమ లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అరెస్టు చేసిన ఎస్ఐ ని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు.

### లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అధికారులు తెలిపారు.

## ఇబ్రహీంపట్నంలో 2కే రన్




**ఇబ్రహీంపట్నం, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రజల్లో సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో మంగళవారం భారీ 2కే రన్ మరియు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహంగా సాగింది. సర్ అంశంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ర్యాలీలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం , అలాగే ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల తహసిల్దార్లు సంయుక్తంగా పాల్గొని సిబ్బందిని, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సమాజ భాగస్వామ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**కుల్కచర్ల, జూన్ 23 (జనం సాక్షి) :** యువత దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల పోలీసుల ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ..విద్యార్థినులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు ఆర్థిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.మంచి విద్య, క్రీడలు మరియు సానుకూల జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం మాదకద్రవ్యాల నిరోధక అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించి, విద్యార్థినులలో అవగాహన స్థాయిని పెంపొందించారు.క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థినులను అభినందించి, విజేతలకు ప్రశంసలు అందజేశారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవి కిషన్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రతి డివిజన్‌లో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

- పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్

**ముషీరాబాద్, జూన్ 23 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ లోని ప్రతి డివిజన్ పరిధిలో ఒక్కొక్క ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాలని పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హైదరాబాద్,సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం గంగపుత్ర రాజకీయ చైతన్యం, విద్య ,ఉద్యోగ,వృత్తి హక్కుల రక్షణకై బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ యువనేత ముఠా జై సింహ, ప్రొఫెసర్ సుదర్శన్ రావు, మెట్టు ధనరాజ్, శ్రీహరి, శంకర్ పలువురు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బైరు శేఖర్ మాట్లాడుతూ గంగపుత్రులు శతాబ్దాలుగా చేపల వేట, చేపల పెంపకం, జలవనుల సంరక్షణను తమ జీవనాధారంగా కొనసాగిస్తున్న సమాజం, దేశ ఆహార భద్రతలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, మత్స్య సంపద అభివృద్ధిలో గంగపుత్రుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. అయినప్పటికీ విద్య ఉద్యోగాలు రాజకీయ ప్రాతినిధ్యం వృత్తి




అభివృద్ధి వంటి రంగాల్లో ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో గంగపుత్ర రాజకీయ చైతన్యం సామాజిక ఐక్యత ఆర్థిక స్వావలంబన అత్యంత అవసరం అన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అదేవిధంగా విద్య ఐక్యత రాజకీయ చైతన్యం ఆర్థిక అనే నాలుగు సూత్రాలతో గంగపుత్రుల సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు.

# ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు

- ఉర్కొండ ఎమ్మార్వో యూసుఫ్ అలీ



**ఉర్కొండ, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ' సర్' ప్రక్రియలో బీఎల్ఓలు, బీఎల్ఏలు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని మండల తహసీల్దార్ యూసుఫ్ అలీ స్పష్టం చేశారు.ఊరుకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్ఓ, బీఎల్ఏలకు' సర్ 'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దుఅని ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలనీ ,18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడికి ఓటు హక్కు కల్పించడం మన కర్తవ్యం అని దిశానిర్దేశం చేశారు.చనిపోయిన వారి పేర్లు, ఒకటికి మించి ఉన్న డబుల్ ఎంట్రీలు వెంటనే తొలగించాలని,చిరునామా మారిన వారి దిద్దుబాట్లు సకాలంలో పూర్తి చేయాలి. రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు లొంగకుండా, నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా పనిచేయాలని సర్ విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్వో యూసుఫ్ అలీ సూచించారు. బీఎల్ఏలు బీఎల్ఓలకు పూర్తిగా సహకరించి, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సిబ్బంది సందేహాలను ఆయన అక్కడికక్కడే నివృత్తి చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది,మండలంలోని అన్ని గ్రామాల బీఎల్ఓలు, బీఎల్ఏలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలతోనే అధికదిగుబడి

- రైతువేదికలో నిర్వహించిన విత్తనమేళ

**మహమ్మదాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మహమ్మదాబాద్ మండలంలోని, మంగళవారంనాడు నంచర్ల రైతు వేదికల్లో నిర్వహించిన, విత్తనమేళా విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణ,మండల వ్యవసాయ అధికారి నరేందర్ మాట్లాడుతూ..నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల వినియోగంతోపాటు ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చనిరైతులకు సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో లాట్ నంబర్,మొలక శాతం,గడువు తేదీ తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.(బీపీటీ--5204,ఆర్ఎన్ఆర్--15048 తెలంగాణ సోనా హెచ్ఎంటీ సోనా,కేఎన్ఎం-1638,కేఎన్ఎం-7715,డబ్ల్యూజీఎల్--44,జై శ్రీరామ్)వంటి.తదితర అధిక దిగుబడి వరి రకాలను పరిచయం చేయడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా కంది,పెసర,మినుములు, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన



కల్పించారు.కార్యక్రమంలో ఏపిఎం నిర్మలరెడ్డి,మాజీ ఎంపీపీ శాంతి రంగ్య,సర్పంచులు,రామ్ లాల్,శ్రీను,గాయత్రిదేవి,అంజా నాయక్,బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బిక్షపతి,రైతులు, ఫర్టిలైజర్ వ్యాపారస్తులు వ్యవసాయశాఖ అధికారులు.నికిత, దివ్య,నరసింహారెడ్డి,దీపిక,పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది
- ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కో కన్వీనర్ రాజేష్ నాయక్



**మహేశ్వరం, జూన్ 23 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కో కన్వీనర్ రాజేష్ నాయక్ అన్నారు.సోమవారం ఏబీవీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మహేశ్వరం మండలంలోని పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలను ఏబీవీపీ కార్యకర్తలు బంద్ చేశారు.ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో,ఎంఈవో, టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ పై దోపిడిని అరికట్టే చట్టాన్ని అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఆల్ ఇండియా కళా మచ్ కో కన్వీనర్ మణికంఠ,మండల నగర కార్యదర్శి రాజేష్,గ్రేటర్ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్ర,వంశీ,సయ్యద్, అభిలాష్, ప్రణీత్, రోహిత్, సిద్దు, చరణ్, సాయి కార్తీక్ ,ఉదయ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలోనే నాణ్యమైన విద్య




**బంట్వారం, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుందని,అర్హులైన ఉపాధ్యాయు లుంటారని సల్బత్తాపూర్ సర్పంచ్ బాల య్య అన్నారు. తన కూతురు అక్షిత ను ఎంపిపిఎస్ పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించారు.గత సంవత్సరం వార్శికోత్సవం సందర్భంగా ప్రజల సమక్షంలో తన కూతురిని ప్రభుత్వ బడిలో చేర్పిస్తానని మాట ఇచ్చి ఇచ్చిన మాట ప్రకారం చేర్మించటం జరిగిందని తెలిపారు. సర్పంచ్ కూతురును తమ పాఠశాలలో చేర్పించటం పట్ల ప్రధానోపాధ్యాయులు నాగజ్యోతి హర్శం వ్యక్తం చేశారు. గ్రామంలోని మిగతా విధ్యార్థుల తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో కూడా అడ్మిషన్ల కోసం కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భం గా గ్రామ సర్పంచ్ని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రావు,ఉపాధ్యా యులు తుకారం, జంగయ్య, చంద్రిక, రఘురాం, వెంకటేశం విశాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు.

## యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన

- తలకొండపల్లి ఎస్ హెచ్ఓ జానకి రామ్ రెడ్డి



**తలకొండపల్లి, జూన్ 23 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు వెల్జాల్ గ్రామం రచ్చబండ వద్ద తలకొండపల్లి ఇన్ స్పెక్టర్ వి.జానకి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ..యువత గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు ఆరోగ్య సమస్యలు,వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం,సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు. యువకులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.అనంతరం మార్కెట్ ప్రాంతంలో ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరంగా వివరించారు.కార్యక్రమం లో తలకొండపల్లి ఎస్సై శేఖర్,మరియు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో నూతన సాంకేతికతలు అందిపుచ్చుకోవాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**షాబాద్, జూన్ 23 (జనం సాక్షి) :** వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావచ్చు అని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన విత్తనమేళా కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులకు అందుబాటులో ఉండేలా విత్తనాలను 23 తారీకు నుండి 30 వ తారీకు వరకు రైతు వేదికలలో అందిస్తుందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర రైతులకు నాణ్యమైన, ధ్రువకరించిన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతుల గురించి, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, రాజేశ్వరి, మౌనిక, శివకుమార్, బాబ్య, శైలజ, డీలర్లు అన్నదాత ట్రేడర్స్ పోచయ్య, హకా సీడ్స్ రాజు, హకా ఫర్టిలైజర్స్ నరసింహారెడ్డి, యోగేశ్వర్ ట్రేడర్స్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస



ట్రేడర్స్ సాయి రెడ్డి, రైతులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24 జూన్ 2026

# జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 23 (జనం సాక్షి) :** నార్సింగి మండల మన తెలంగాణ విలేకరి శ్రీ రాఘవేందర్ పై జరిగిన దాడి ఘటనను మెదక్ జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, టీయూడబ్ల్యూజె (143) జిల్లా నేత సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన నేపథ్యంలో విలేకరి రాఘవేందర్పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం జర్నలిస్టుల విధి అని, తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తించే మీడియా ప్రతినిధులపై



దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇటువంటి । దాడులు జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. రాఘవేందర్పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.మీడియా ప్రతినిధుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉపేక్షించరాదని తెలిపారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, తిమ్మన్నగారి శ్రీధర్, నాగరాజు శర్మ, ఫారుక్ హుస్సేన్, బొందుగుల నాగరాజు, మువ్వనవీన్, గోపాల్ గౌడ్,కామాటి కృష్ణ, లక్ష్మి నారాయణ, పాపన్నపేట శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, సందీప్, గోవర్ధన్ రెడ్డి, ఖయ్యూమ్, నీలం, చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సంగమేష్, రహమాత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



**పెద్ద శంకరంపేట, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విఠల్ అన్నారు. మంగళవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోణం విట్టాలు మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం పోరాడిన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం కోసం శ్యాం ప్రసాద్ ముఖర్జీ పోరాటం చేశారని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బి జె వై ఎమ్ అధ్యక్షుడు బుగుడాల కృష్ణ. నాయకులు వెంకయ్య ఆంజనేయులు సురేష్ భూషణం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# విలేకరిపై దాడి అమానుషం



**నిజాంపేట, జూన్ 23 (జనం సాక్షి) :** విలేఖరిపై దాడి చేయడం సమంజసం కాదని, ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను హరిస్తున్నారని టియుడబ్ల్యూజేఐజేయు ఆధ్వర్యంలో తహసిల్దార్ శ్రీనివాస్ కు నిందితులను కఠినంగా శిక్షించాలని వినతి పత్రాన్ని నిజాంపేట మండల విలేకరులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు అజ్గర్ మాట్లాడుతూ.. నార్సింగి మన తెలంగాణ రాఘవేందర్ రిపోర్టర్ పై దాడి చేయడం హేయమైన చర్య అని దీనిపై అధికారులు వెంటనే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విలేకరులు చంద్రకాంత్, బాలరాజు కుర్మా, భరత్ రెడ్డి, ఉడేపు శ్రీకాంత్, సిద్ధరాములు, ప్రదీప్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ అత్యంత కీలకమని,ఈ ప్రక్రియను జిల్లాలో సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు.ఎస్. ఐ ఆర్ లో భాగంగా నిర్వహించే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడంలో బూత్ స్థాయి అధికారులదే కీలక బాధ్యత ఉంటుందని, ఇంటింటికి వెళ్లి సర్వే చే సేటప్పుడు వచ్చే అనుమానాలను శిక్షణా తరగతిలోనే నివృత్తి చేసుకోవాలని ఆమె సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నారాయణ పేట నియోజక వర్గ స్థాయి బీ ఎల్ వో లు, సూపర్ వైజర్ల కు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, మొదటి నాలుగైదు రోజుల్లో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ




చేయాలన్నారు.పంపిణీ చేసే సమయంలోనే ఆయా ఇంటి యజమానులకు ఫామ్స్ పూర్తి చేయాలని చెప్పాలని, మళ్ళీ తిరిగి వస్తామని తెలపాలన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి తిరిగి ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు ఉండదు అని ఇంటి యజమానులకు తెలియజేయాలన్నారు. ఫామ్స్ నింపలేని నిరక్షరాస్యులకు బీఎల్‌వోలు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. బిఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు ఎన్ని ఫామ్స్ ఇచ్చారు ! ఎన్ని తిరిగి తీసుకున్నారు అనే విషయం తమకు తెలుస్తుందని ఆమె చెప్పారు.ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎవరికి సెలవులు,బదిలీలు, మినహాయింపులు ఉండవు అని కలెక్టర్ స్పష్టం చేశారు.ఒక వ్యక్తికి ఒక్క ఓటు మాత్రమే ఉండాలని, రెండు ఓట్లు ఉన్నా, రెండుచోట్ల ఓటు వేసినా చట్ట పరమైన చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ చేసే సమయంలోనే ఆ పోలింగ్ బూత్ ల పరిధిలోని వీ ఐ పీ ల జాబితా ను తయారు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా ఏ చిన్న పొరపాటు చేయవద్దని ఆమె తెలిపారు.బీ ఎల్ వో లు రెగ్యులర్ విధులతో పాటు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను కూడా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.అంగన్ వాడీ టీచర్ల మొబైల్ ఫోన్ లలో యాప్ డౌన్ లోడ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీ ఆర్ వో రాజేశ్వరి, ఆర్డీవో రమేష్, కలెక్టరేట్ ఏ వో అనిల్, కోయిల కొండ, దామరగిద్ద, నారాయణ పేట, ధన్వాడ, మరికల్ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశ్రామిక ఉద్యోగ కల్పనకు పాటుపడాలి

- శాంత బయోటెక్ పరిశ్రమలో మొక్కలు నాటిన కలెక్టర్
- పారిశ్రామిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలి
- కార్మికుల భద్రత సబ్సిడీలపై ప్రత్యేక చొరవ అవసరం



**మనోహరాబాద్, జూన్ 23 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలో పారిశ్రామిక ఉపాధి కల్పనకు పాటుపడాలి అదేవిధంగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం ,మనోహరాబాద్ మండలంలోని శాంత బయోటెక్ పరిశ్రమలో జిల్లా పారిశ్రామిల అభివృద్ధి పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో ఉంచాల్సిన బాధ్యత పారిశ్రామిక వేత్తలదే జిల్లాలో నిరుద్యోగ భారం పెరగకుండా ఉద్యోగ అవకాశాల కోసం నూతన యాప్ లు స్కిల్డ్ అన్ స్కిల్డ్ సాంకేతిక విభాగాలో ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించాలి జిల్లాలు పారిశ్రామిక అభివృద్ధి జరిగి పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం చొరవ చూపాలన్నారు. పరిశ్రమలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కోసం నూతన యాప్ శిక్షణను పారిశ్రామిక వేతలకు జరిగింది పారిశ్రామికవేత్తలు చాలా ఉత్సాహంతో వారి సందేహాలు నివృత్తి చేసుకోవడం జరిగింది. కార్యక్రమం అంతరం శాంత బయోటెక్ పరిశ్రమలలో మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రకాష్ రావు,ఐల అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి, అసోసియేషన్ సభ్యులు మరియు వివిధ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# మక్తకుంట ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- **ఎమ్మెల్యే ఆదేశం..**

**రామచంద్రాపురం, జూన్ 22 (జనం సాక్షి) :** తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని సందుగూడెం మక్తకుంట చెరువును ఆక్రమించేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నీటిపారుదల శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి చెరువును ఆయన పరిశీలించారు. ఇటీవల కొందరు వ్యక్తులు శిఖం భూమి పేరుతో చెరువులో మట్టి నింపి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. గ్రామానికి అనుసంధానంగా ఉన్న చెరువు కట్ట రహదారిని ధ్వంసం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశాబ్దాలుగా గ్రామస్తులు ఇదే రహదారి ద్వారా అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. శిఖం పట్టా భూముల్లో వ్యవసాయం చేసుకోవచ్చని, అయితే మట్టి నింపి చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చెరువు కట్టను రెండు రోజుల్లో పునరుద్ధరించడంతో పాటు ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. చెరువుకు చెందిన ఒక్క గజం భూమి కూడా కబ్జా కావడానికి అవకాశం ఇవ్వబోమని ఎమ్మెల్యే తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, ఏఈ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, సీనియర్ నాయకులు రమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళికతో నిర్వహించాలి

- **ప్రతి ఓటరుకు ఎన్నుమరేషన్ ఫారాలను అందజేయాలి**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, జూన్ 23 (జనం సాక్షి) :** ఓటరు జాబితాను తప్పులు లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసిల్దార్లు, బిఎల్ఓలు, ఇతర అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్



నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా సంబంధిత బిఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్నుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అంశాలన్నింటిని ఓటర్లు ఫారాలలో పూరించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారం కూడా తీసుకోవచ్చన్నారు. బిఎల్ఓ లు ప్రతిరోజు ఎన్ని ఇండ్లు తిరుగుతున్నారు, ఓటర్ల నుంచి ఫిలప్ చేయబడ్డ ఫారాలు ఎన్ని తిరిగి వచ్చాయనే సమగ్ర డేటాను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతిరోజు రివ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. బి ఎల్ఓ లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసిల్దారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎవరైనా ఓటర్లు నిర్దేశిత వెబ్సైట్లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడానికి కూడా అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుతం ఎలాంటి తప్పులు లేని సమగ్ర ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌పై మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారిణి డా. క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా అమలు చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను పరిశీలించి ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో సమీక్షించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... గుర్తించిన సమస్యలను మూడు విభాగాలుగా వర్గీకరించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఉప కలెక్టర్ ఉమాహారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జోగులాంబ గద్వాలే లక్ష్యం

- **జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**

**గద్వాల నడిగడ్డ, జూన్ 23 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతపురం గ్రామశీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు లిజిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక మరియు చట్టపరమైన నష్టాలపై ఆయన విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా, ముమ్మర తనిఖీలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల



పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షణిక ఆనందం కోసం గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలైతే విద్యాభ్యాసం, కెరీర్, కుటుంబ జీవితం పూర్తిగా నాశనమవుతాయని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే చిన్న అలవాటే చివరకు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపించి తీవ్ర ఆందోళనకు గురవుతారని ఎస్పీ తెలిపారు. మత్తుకు బానిసైన వారు సులభంగా నేరాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా డ్రగ్స్ రవాణాకు లేదా విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, ఇలాంటి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య, విదేశీ ప్రయాణాల వంటి అవకాశాలు పూర్తిగా గల్లంతవుతాయని స్పష్టం చేశారు. పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో గంజాయి అమ్మేవారి సమాచారాన్ని వెంటనే డయల్–100కు గానీ, పోలీసులకు గానీ అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.అనంతరం గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమన్న, ఉపాధ్యాయ బృందం, రూరల్ పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ నిత్య వెంకటేష్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 23(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్‌లను పరిశీలించిన విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందిం చుకునేలా ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లైబ్రరీని సందర్శించి, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ అరుణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

- పాపాలు కడుక్కోడానికే పోచంపల్లి కుట్టు మిషన్ల పంపిణీ
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, జూన్ 23 (జనం సాక్షి):** కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత బిఆర్ఎస్ పార్టీకి లేదని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ సమావేశంలో బిఎల్ఏ లకు ట్రైనింగ్ తక్కువ, కాంగ్రెస్ పార్టీని, నాయకులను దూషించడమే ఎక్కువ అని అన్నారు. టిఆర్ఎస్ నాయకుల తిట్ల పురాణం అబద్ధాలు వారి తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికేనని, వారు మాట్లాడుతూ దాంట్లో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులు, నిరుద్యోగ యువకుల ఉసురుపోసుకున్నారని విమర్శించారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నిబద్ధత, నిజాయితీ కలిగిన వ్యక్తిని కాబట్టే నేను ఎక్కడికిపోయినా ప్రజలు ఆదరిస్తున్నారని, ప్రజల మనిషిని కాబట్టే గెలుస్తున్నానని అన్నారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి ఫామ్ హౌస్ పై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని బిఆర్ఎస్ నాయకుల తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందని ఎమ్మెల్యే రేవూరి విమర్శించారు.

## విత్తన మేళా కార్యక్రమం ప్రారంభం



**ములుగు ప్రతినిధి, జూన్ 23(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా రైతు వేదికలలో విత్తన మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు వివిధ రకాల సన్న రకాల వరి విత్తనాలు, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు మరియు పప్పుధాన్యాల విత్తనాలను అధీకృత డీలర్ల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. రైతులకు సులభంగా అందుబాటులో ఉండేలా రైతు వేదికల వద్ద ప్రత్యేక విక్రయ కేంద్రాలు (సేల్ పాయింట్లు) ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములుగు రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆత్మ కమిటీ చైర్మన్ కొండెం రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు రాజేందర్ గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, వ్యవసాయ అధికారి పరమేశ్వర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి మరియు రైతు సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఈ నెల 23వ తేది నుంచి వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. అలాగే ములుగు మండలంలోని ఐదు రైతు వేదికలలో సంబంధిత వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో, సర్పంచుల చేతుల మీదుగా విత్తన మేళా కార్యక్రమాలను ప్రారంభించారు.

## యూరియా లింకులు అంటగడుతున్న డీలర్లు



- యూరియాను అధిక ధరలకు విక్రయం
- నిమ్మకు నీరెత్తినట్టుగాఎవరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న

**బజార్‌హత్నూర్/ఇచ్చోడ, జూన్ 23( జనం సాక్షి):** మండల కేంద్రంలోని విత్తనం, ఎరువుల డీలర్లు కలిసి రైతుల అవసరాలను ఆసరాగా చేసుకునే యూరియాను ఒక బ్యాగు అసలు ధర 267 ఉండగా, ఎరువులను ఒక్కొక్క బ్యాగుని 320 రూపాయల నుండి 325 రూపాయల వరకు అమ్ముతున్నారు అలాగే యూరియా బస్తాలకు లింకులు అంటగడుతున్నారు. అలా రైతులను ఆర్థికంగా నష్టపరిచిన దాకలలు ఉన్నాయని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలిపారు. యూరియాను కానీ పోటాష్, కానీ డిఏపి కూడా అధిక ధరలకు విక్రహిస్తున్న డీలర్ల లైసెన్స్ ను రద్దు చేయాలనీ అయన అన్నారు. మరి ముక్యంగా రైతులకు బాసటగా ఉండవలసిన వ్యవసాయ శాఖ వారు మొద్దు నిద్ర పోతున్నారని, ఇదేవిదంగా ప్రత్యేకమైన టాస్క్ పోర్స్ కమిటీ మరియు విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహారిస్తుందని అయన దుయ్యబట్టరు. ఇచ్చోడా కేంద్రంగా కొన్ని వందల వేల మంది రైతులు తమ పంట ఎదగడానికి, ఆకుపచ్చగా మరియు ఆక్సీజన్ అందించే విదంగా చూసుకోవడానికి కొన్ని వేల యూరియా బ్యాగులను రైతులు తీసుకున్నట్లు నా యొక్క నిజానిర్దారణలో తేటతెల్లం అయ్యిందని అన్నారు. ఇప్పటికైనా విత్తన ఎరువుల డీలర్లపైన ప్రత్యేక శ్రద్ధ వహించి , అదనంగా ఎక్కువ ధరకి అమ్మిన వారిపైన పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు రామకృష్ణ, జయవంత్ రావ్, మహేష్, ప్రహ్లాద్, వెంకట్రావ్, సుగుణబాయి, జంగు బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- అర్హత కలిగిన పౌరులు ఓటరు జాబితాలో నమోదు కావాలి
- 25 నుండి వచ్చే నెల 24 వరకు బూతు లెవల్ అధికారుల ఇంటింటి సర్వే
- జూలై 31న ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ
- జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం
- అక్టోబర్ 1న తుది జాబితా ప్రచురణ
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నుండి వచ్చే నెల 24 వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. జులై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లేములు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని తెలిపారు. జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ క్లైములు అభ్యంతరాల పరిష్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా అక్టోబర్ ఒకటో తేదీన తుది ఓటర్ జాబితా ప్రచురణ జరుగుతుందని కలెక్టర్ వివరించారు. వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో మొత్తం 799 పోలింగ్ స్టేషన్లో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమానిర్వహణలో బిఎల్ఓ లతోపాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏ లు కూడా కలిసి పని చేస్తారని తెలిపారు. ఓటరు జాబితా ను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుని పేరు ఓటరు జాబితాలో నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం అలాగే అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం కొత్తగా అర్హులైన ఓటర్లను గుర్తించడం మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలి వెళ్లిన వారి వివరాలు నమోదు చేయడం ఓటర్ జాబితాలో అవసరమైన మార్పులు చేర్పులు మొదలైన వాటికోసం దరఖాస్తులు స్వీకరించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. బి ఎల్ వోలు ప్రతి ఇంటిని సందర్శించి ముందుగానే ముద్రించబడిన ఇనుమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేస్తారని ఫారాలను ఎలా పూరించాలో వారికి మార్గ దర్శనం చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదయి ఉన్న ద్వంద ఓటర్లను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం తగిన విచారణ అనంతరం అవసరమైన తొలగింపు చర్యలు చేపట్టబడతాయని తెలిపారు. బిఎల్వోలు ప్రతి ఇంటిని మూడుసార్లు పరిశీలిస్తారని చెప్పారు. ఎస్ ఐ ఆర్ విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనమిచ్చి చట్టపరమైన చిక్కుల్లో పడొద్దు

- ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి ఉండాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, జూన్ 23 (జనం సాక్షి) :** వాహనదారులు మైనర్లకు వాహనం అందజేసి వారి కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని చట్టపరమైన చిక్కుల్లో పడోద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రతి పోలీసు అధికారి నిరంతరం కృషి చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం, కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొంత మంది వాహనదారుల బాధ్యతరాహిత్య కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునే వున్నాయి. ప్రధానం ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మైనర్ వాహనదారుల కారణంగా అధికంగా జరుగుతున్నాయి. గత రెండు రోజుల క్రితం పర్వతగిరి పోలీస్ స్టేషన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్దులతో పాటు, ఒక మైనర్ బాలుడు మరణించగా, మరో మైనర్ బాలుడు తీవ్ర గాయలతో ప్రస్తుతం చికిత్స పోందుతున్నాడు. ఈ రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణంగా మైనర్ బాలుడు అతి వేగంగా వాహనం నడుపుతూ ఇద్దరు వృద్దులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీ కోట్టడం కారణంగానే సంఘటన స్థలంలోనే మైనర్ బాలుడితో పాటు ఏ పాపం ఎగురుగని ఇద్దరు వృద్దులు మరణించారు. ఈ సంఘటన చాలా బాధకరమైన విషయం. ఈ సంఘటనపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి వుండాలని, ముఖ్యంగా మైనర్లకు వాహనం అందజేయడం చట్టరీత్యా నేరమని, ఇలా మైనర్లకు వాహనం అందజేయడం ద్వారా మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని లేదా మైనర్ తల్లిదండ్రులు బాధ్యులుగా చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారిని జైలులు తరలించడం కూడా జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వాహనదారులను హెచ్చరించారు. ఇకనైన వాహనదారులు తమ వాహనదారులు మైనర్ డ్రైవర్లకు వాహనాలు అందజేయడం లేదా వారిని ప్రోత్సహించవద్దని పోలీస్ కమిషనర్ వాహనదారులకు హితవు చేసారు.



## ఓటరు అవగాహన కోసం నేడు 2కె రన్

- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచేందుకు 2కె రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 24న బుధవారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు ఇల్లందు క్లబ్ హౌస్ నుంచి మంజూరునగర్ ఐడిఓసి కార్యాలయం వరకు ఈ 2కె రన్ ఉంటుందన్నారు. ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం, ఓటు హక్కు వినియోగంపై చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

## టీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేశెట్టి సంతోష్ కుమార్ నియామకం



**తాండూర్, జూన్ 23(జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా నిలబెట్టి, ఉద్యమ కారుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కారులను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) రాష్ట్ర కమిటీ కీలక నియామకాలను చేపట్టింది. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా తాండూర్‌కు చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజిక సేవకుడు కేశెట్టి సంతోష్ కుమార్‌ను టీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని టీయూవీ మండల అధ్యక్షుడు నిరంజన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కేశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గౌరవ పరిరక్షణ, ఉద్యమ చరిత్రను భావితరాలకు చేరవేయడం, ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేశెట్టి సంతోష్ కుమార్ నియామకాన్ని స్వాగతిస్తూ టీయూవీ మండల అధ్యక్షుడు నిరంజన్ రావు, రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ వేదిక అధ్యక్షుడు మాసాడి శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దిబోయిన అర్జున్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బోడ సతీష్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమం పట్ల అంకితభావం, సామాజిక సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న సంతోష్ కుమార్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు రూపొందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి
- డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులతో నగర పార్కుల అభివృద్ధిపై సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 23 (జనం సాక్షి) :** నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు రూపొందించి అభివృద్ధి పనులను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళ వారం హన్మకొండ కలెక్టరేట్ లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, బల్దియా అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి డబ్ల్యూఆర్ఐ అందించిన ఆధునిక డిజైన్లను అనుసరించి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే తరహాలో నగరం లోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యూ ఆర్ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. నగరంలో పచ్చదనం పెంపొం దించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని, ఈ కార్యక్రమంలో డబ్ల్యూఆర్ఐ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగీర్జీ డబ్ల్యూఎంసీ సూపరిం టెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## అయ్యా సార్లు కొంచెం మా కష్టాలు చూడండి



- చిన్న వర్షాలకే రోడ్లు జలమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

**కౌటాల జూన్ 23 (జనం సాక్షి) :** వర్ష కాలం వచ్చిందంటే చాలు చిన్న చిన్న వర్షాలకు రోడ్లు, కాలనీలు వరదలతో ముంచెత్తుతున్నాయి. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కౌటాల మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో ప్రధాన రహదారిపై భారీగా నీరు నిలవడంతో జలమయంగా మారింది. వచ్చి పోయే వాహన దారులు నరక యాతన పడుతున్నారు. ప్రతి ఏటా పై అధికారులు చూసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి రోడ్ మీద నీటి నిలువ చేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేయడం లేదు. దాంతో వర్షానికి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కౌటాల నుండి కాగజ్నగర్ వెళ్ళే వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్తంపేట్ నుండి ప్రతి రోజు పాఠశాల విద్యార్థులు అదే రహదారి గుండా వెళ్తుంటారు. ద్విచక్ర వాహన దారులకు గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి.

### దుర్వాసన వస్తుంది : నిష్టూరపు, రమేష్ ముత్తంపేట్ నివాసి



ప్రధాన రహదారి పక్కనే మా ఇల్లు ఉండటంతో వర్ష కాలం చాలా ఇబ్బందులు పడుతున్నాము. వర్షం వచ్చినప్పుడు నీరు రోడ్ పై నిలువ ఉంటుంది. వాహనాలు వెళ్తున్నప్పుడు బురద పడుతుంది. రెండు మూడు రోజులు నీరు నిలువ ఉంటే బురద మయంగా భారీ దుర్వాసన వస్తుంది. పై అధికారులు స్పందించి నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలి.

### అధికారులు పట్టించు కోవడం లేదు : ఇప్ప దుర్గయ్య, ముత్తంపేట్



ప్రతి ఏటా వర్ష కాలంలో తిప్పలు తప్పడం లేదు. ఇంట్లో నుండి బయటకు వెళ్ళే పరిస్థితి లేదు. అధికారులు శాశ్వత పరిష్కారం చేయాలి. ప్రధాన రహదారికి ఇరు వైపులా డ్రైనేజీ కట్టించి రోడ్ పై నీరు నిలువ కుండా ఏర్పాట్లు చేయాలి.

## విత్తనాల ఎంపిక - సాగు పద్ధతులపై అవగాహన

● రైతు మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**కనగల్లు, జూన్ 23 (జనం సాక్షి) :** వానాకాలం పంటలలో రైతులు చేపట్టవలసిన సాగు పద్ధతులు, విత్తనాల ఎంపికపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన విత్తనమేళ అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రారంభించారు. రైతులను ఉద్దేశించి కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సన్నాలకు రైతులు ప్రాధాన్యత నివ్వాలని ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నందున తక్కువ నీటితో పండే పంటలనే రైతులు ఎంచుకొని వాటినే సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సన్న రకాలైన ఆర్ఎన్ఆర్ 15048, బిపిటి 5204, కేఎన్ఎం 1638, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, వరంగల్ 44, కేఎన్ఎం 7715 విత్తనాలను నాటి అధిక దిగుబడి పొందడంతో పాటు ప్రభుత్వం 5 వందల రూపాయల బోనస్ ఇస్తుందని పేర్కొన్నారు. కనగల్ సబ్ మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న హ్యామ్ పైలాన్ ప్రాజెక్ట్ పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసిల్దార్ బి పద్మ, మండల వ్యవసాయ అధికారి బి అమరేందర్ గౌడ్, ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి, గిర్దావర్ సునీత, కనగల్లు సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్, బోయిన్పల్లి సర్పంచ్ వంపు నాగమణి జానయ్య , ఉప సర్పంచ్ మండ లి చంద్రయ్య, ఏ ఈ ఓ లు విజయలక్ష్మి మౌనిక ఆర్ అండ్ బి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## నిర్వాసితులతో సమావేశమైన మాజీ మంత్రి హరీష్ రావు

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 23 (జనం సాక్షి) :** ఖమ్మం రఘునాథపాలెం మండలంలోని 218 సర్వే నంబర్ నిర్వాసితులతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ తన్నీరు హరీష్ రావు మంగళవారం సమావేశమయ్యారు.ఖమ్మం బురహాన్ పురంలోని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు,తాతా మధుసూదన్, ఎర్రోళ్ల శ్రీనివాస్,నాయకులు పగడాల నాగరాజు,శీలంశెట్టి వీరభద్రం,ఏనుగుల రాకేష్ రెడ్డి,బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాధితులు తమకు జరిగిన అన్యాయం గురించి హరీష్ రావుకు వివరించి న్యాయం చేయాల్సిందిగా కోరారు.ఆయన వెంటనే కలెక్టర్ కు ఫోన్ చేసి నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతానని స్పష్టం చేశారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలి



**వనపర్తి బ్యూరో, జూన్ 23 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో భారీ చైతన్య సదస్సు, కార్యశాల ను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు భుజాల అనుజ్ఞ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ పాపయ్య గౌడ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఆధారిత వ్యవసాయం వల్ల భూమి సారం క్షీణిస్తోందని, రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవామృతం, ఘనజీవామృతం తయారీ, సేంద్రియ ఎరువుల వినియోగం, నేల సారవంతత పెంపు, పంటల దిగుబడి మెరుగుదల వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రీయంగా సమాధానాలు ఇస్తూ విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాకాసి అరవింద్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు దాబా శ్రీనివాస్ రెడ్డి , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర నాయకులు సబ్బి రెడ్డి వెంకట్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి , కేతూరి బుడ్డన్న , జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్ , వారణాసి కల్పన , జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి , బీజేపీ సీనియర్ నాయకురాలు సుమిత్రమ్మ ,జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ ,26వ వార్డు బీజేపీ కౌన్సిలర్ విజయ్ , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కవిత , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్ , రామ్ రెడ్డి , ప్రవీణ్ , తిరుపతి నాయక్ తదితరులు వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కనబరిచారు.వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధికి ప్రకృతి వ్యవసాయం కీలకమని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు, రైతు సోదరులు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 23 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "ప్రతి ప్రసవం సురక్షితం" కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్




ఎక్స్‌రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ త్యాగాలు చిరస్మరణీయం



**తెలకపల్లి, జూన్ 23 (జనం సాక్షి) :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, దేశ సమైక్యతకు అంకితమైన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శిశు మందిర్ విద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అతినారపు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్‌ను దేశంలో అంతర్భాగంగా నిలబెట్టేందుకు శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ సమైక్యత, జాతీయత కోసం ఆయన చేసిన త్యాగాలు భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంద చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు కనుక రమేష్, భాస్కర్ గౌడ్, సైదులు, భాషమోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే పనుల్లో పారదర్శకత పాటించాలి

● అదనపు కలెక్టర్ హరిప్రియ



**జడ్చర్ల, జూన్ 23 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీలో నక్ష సర్వే కార్యక్రమం అమలుపై రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సర్వే పనులలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రికార్డులను పక్కాగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, తహశీల్దార్ నర్సింగ్ రావు, మండల సర్వేయర్లతో కలిసి ఈ పర్యటన చేపట్టారు. భూ రికార్డుల నమోదులో వేగం, కచ్చితత్వం పాటించాలని, సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక అంశాలపై తగిన సూచనలు చేస్తూ, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత ముందుండాలి

● ఎస్పీ నరసింహ

**అనంతగిరి, జూన్ 23 (జనం సాక్షి) :** డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల తగ్గింపులో యువత, విద్యార్థులు అంబాసిడర్లుగా పనిచేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా అనంతగిరి మండలంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ నరసింహ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే రంగాల్లో రాణించాలని కోరారు. డ్రగ్స్ వంటి వ్యసనాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరమని పేర్కొన్న ఆయన, విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ బృందాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకురావడానికి పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.సైబర్ నేరాలపై కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు చెప్పవద్దని సూచించారు. ఉచిత ఆఫర్లు, లింకులు, ఫోన్ కాల్స్ పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, బైక్ రేసింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోలీస్ కళాబృందం డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించింది.

### అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

అవగాహన కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ



అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచాలని అధికారులకు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై కూడా ఆరా తీశారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్, షీ టీమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఎం. ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

● జిల్లా కలెక్టర్ దివాకర

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 23 (జనం సాక్షి) :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,లి ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే



అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "యానాది ముఠా" గుట్టు రట్టు

**పెనుబల్లి, జూన్ 23 (జనం సాక్షి) :** ఇటీవల వరుస దొంగతనాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న "యానాది ముఠా" గుట్టు రట్టుచేసి కొంతమంది సభ్యులను వి.ఎం బంజర్ పోలీసు అదుపులోకి తీసుకున్నారు. కల్లూరు డివిజన్ ఏసిపి వసుంధర యాదవ్ వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకపల్లిసివారు గ్రామంలో గల పామాయిల్ తోట కాపలాదారులు అయిన మణి కాల వసంతరావు, మణికాల రమేష్, పొన్నూరి కోటేశ్వరరావు, తుమ్మల శేఖర్ అనే వ్యక్తులు వచ్చారనే విశ్వసనీయ సమాచారంతోమంగళవారం విఎం బంజర ఎస్ ఐ కె వెంకటేష్ తన సిబ్బందితొ వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ విచారణలో మణి కాల వసంత రావు అనే వ్యక్తి వెంకట రామారావు ఫామా యిల్ తోటలో ఉంటూ , గత కొంత కాలంగా దొంగతనాలు చేస్తూ జైలుకు వెళ్ళి వస్తూ ఉండేవాడని మిగతా వ్యక్తులతో కలిసి దొంగతనాలకు పాల్పడుతూ ఉండేవారని తెలిపారు. యానాది ముఠాగా ఏర్పడి ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న వీరిపై కేసు నమోదు చేసి సత్తుపల్లి కోర్టుకు రిమాండ్ చేస్తూ తప్పించుకున్న ముద్దాయి ఆచూకీ నిమిత్తం గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఏసిపి తో పాటు ఎస్ ఐ కే వెంకటేష్, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగయ్య, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.









## ఆవిరి అవుతున్న మస్క్ ఆనందం..

### స్పేస్‌ఎక్స్ షేర్ల భారీ పతనం


**ముంబై:** స్పేస్‌ఎక్స్ ఐపీవో ఆనందం నెమ్మదిగా ఇన్వెస్టర్లలో ఆవిరి అవుతోంది. ఆ సంస్థ షేర్లు గత మూడ్రోజులుగా వరుసగా భారీ పతనాన్ని చవిచూస్తున్నాయి. దీంతో దాని మార్కెట్ విలువ ఏకంగా 600 బిలియన్ డాలర్లకుపైగా పడిపోయింది. భారీగా రుణ సమీకరణకు ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ బాండ్లను విక్రయిస్తామని స్పేస్‌ఎక్స్ ప్రకటించిన తర్వాత నుంచి .. మదుపర్లు అప్రమత్తమై భారీగా షేర్ల విక్రయాలు మొదలుపెట్టారు. సోమవారం ఒక్కరోజే కంపెనీ వాటాల విలువ 16 శాతం పడిపోయింది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ 2 ట్రిలియన్ డాలర్లకు పైగా ఉంది. "ఈ షేర్లను దక్కించు కోవాలని అనుకున్నవాళ్లు కొనుగోలు చేశారు.. ఇప్పుడు తిరిగి సెల్లర్ల కంట్రో ల్‌లో ఉంది" అని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. 75 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయి ఐపీవో లిస్టింగ్ తర్వాత ఈ కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ చేశాయి. పబ్లిక్ ఇష్యూలో షేరు ధర 135 డాలర్లు కాగా కొన్ని రోజుల్లోనే వీటి విలువ 60% పెరిగింది. ఆ తర్వాత కంపెనీ 20 బిలియన్ డాలర్ల బాండ్లు ఆఫర్ చేయనున్నట్లు కథనాలు వెలువడటంతో ఇన్వెస్టర్లు విక్రయాలు మొదలుపె ట్టారు. ప్రస్తుతం మార్కెట్ విలువలో స్పేస్‌ఎక్స్ ఆరో అతిపెద్ద కంపెనీగా నిలిచింది.

## మళ్లీ టెలిగ్రామ్ అందుబాటులోకి..

ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ తిరిగి యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. గూగుల్ ప్లేస్టోర్‌లో కూడా దీనిని పునరుద్ధరించారు. ప్రస్తుతానికి యాపిల్ యాప్‌స్టోర్‌లో మాత్రం డీలిస్ట్ అయ్యే కనిపిస్తోంది. నీట్ రీటెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై జూన్ 16న కేంద్రం తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ఈ నెల 22 వరకు టెలిగ్రామ్ యాప్‌పై, ఈ నెల 30 వరకు మెసేజింగ్ ఎడిటింగ్ ఫీచర్‌పై ఆంక్షలు విధించింది. ఆ పేపర్ లీక్ వ్యవహారంలో ఎన్‌టీఏ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. గతనెల 3న జరిగిన నీట్ ప్రశ్న పత్రాలు లీకైన నేపథ్యంలో దాన్ని రద్దు చేసి.. 'నీట్ - యూజీ'ని ఈనెల 21న తిరిగి నిర్వహించారు.

# 24వేల దిగువకు నిఫ్టీ

### ఐటీ, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు..




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్ సూచీలు నష్టాలు చవిచూశాయి. ఆరంభంలో స్వల్ప నష్టాలకే పరిమితమైన సూచీలు.. ఆఖర్లో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 850 పాయింట్లకుపైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24వేల పాయింట్ల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,086.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,094.07) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో మోస్తరు లాభనష్టాల్లో కదలాడిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత భారీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,082.51 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 893.39 పాయింట్ల నష్టంతో 76,200.68 వద్ద ముగిసింది. నిఫ్టీ 278.80 పాయింట్ల నష్టంతో 23,824.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మిగిలినవన్నీ నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.49 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4130 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు అన్ని ప్రపంచ మార్కెట్లూ నష్టాల్లోనే ముగిశాయి. అంతకుముందు అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు పురోగమిస్తుండటంతో, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం స్టాక్ మార్కెట్లకు సానుకూలత తెచ్చిపెట్టింది. దేశీయ సూచీలూ లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 30 పైసలు తగ్గి 94.63 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 3.92% తగ్గి 77.41 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ మినహా మిగతావన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లూ సానుకూల ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.03 లక్షల కోట్లు పెరిగి రూ.480.56 లక్షల కోట్ల (5.09 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. లాభాల్లో.. స్వల్ప శ్రేణిలో..: ఉదయం బీఎస్‌ఈ సెన్సెక్స్ 77,160.67 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 76,802.90) ఆరంభమైంది. ఆ తర్వాత స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడింది. ఒక దశలో 77,325.56 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 291.17 పాయింట్ల లాభంతో 77,094.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 89.80 పాయింట్లు కోల్పోయి 24,102.90 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,168.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 24,073.15 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. 11 కంపెనీల షేర్లు నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 11 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా 1.72%, సన్‌ఫార్మా 1.43%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.31%, ఇన్ఫోసిస్ 1.29%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.01%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.99% పెరిగాయి. ఏషియన్ పెయింట్స్ 2.17%, టైటన్ 1.15%, పవర్‌గ్రిడ్ 0.87%, ట్రెంట్ 0.78%, ఐటీసీ 0.75% తగ్గాయి. బీఎస్‌ఈ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ, ఇంధనం, చమురు- గ్యాస్, ఇండస్ట్రియల్స్, ఐటీ రాణించగా.. మన్నికైన వినియోగ వస్తువులు, ఎఫ్ఎమ్‌సీజీ డీలాపడ్డాయి. బీఎస్‌ఈలో 2,635 కంపెనీల షేర్లు లాభపడగా, 1,754 కంపెనీల షేర్లు నష్టపోయాయి. 197 కంపెనీల షేర్ల ధరలో మార్పులేదు. జియో పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించడంతో, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు బీఎస్‌ఈలో 1.31% పెరిగి రూ.1,326.55 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,275.96 కోట్లు పెరిగి రూ.17,85,158.92 కోట్లకు చేరింది.

## ఒరాకిల్ ఏడాదిలో 21వేల మంది తొలగింపు..

### భవిష్యత్తులోనూ కోతలు..!

**వాషింగ్టన్:** ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ భారీస్థాయిలో ఉద్యోగాలకు కోతపెట్టింది. గత 12 నెలల్లో 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడంతో ఉద్యోగులను తగ్గించుకోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులోనూ ఈ కోతలు కొనసాగుతాయని వెల్లడించింది. ఈ లేఆఫ్‌లతో ఉద్యోగుల సంఖ్య 1,41,000కు పడిపోయింది. 49 వేలమంది అమెరికా ఉద్యోగులు ఉండగా.. విదేశాల్లో 92 వేలమంది పనిచేస్తున్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ వంటి క్లౌడ్, డేటా సెంటర్ల దిగ్గజాలు ఏఐ మోడల్స్ వినియోగంపై ఎక్కువగా మొగ్గుచూపుతున్నాయి. డేటా సెంటర్లను నిర్మాణంలో భాగమైన ఈ సంస్థ.. తీవ్ర ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటోంది. నగదు ఆదా, కార్యకలాపాల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా ఉద్యోగాలకు కోత పెడుతోంది.




## మీ తప్పులను కప్పిపుచ్చకోవడానికి మాపై నిందలా?

తేల్చి చెప్పింది. అసలేం జరిగిందటే..ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఈ ఆందోళనల వెనుక భారత్ ప్రభావం ఉందంటూ నోరు పారేసుకున్నారు. అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్ నీటి భద్రతకు ముప్పు వాటిల్లిందని భావిస్తే భారత్‌పై యుద్ధానికి కూడా వెనుకాడబోమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో స్పందిస్తూ ఖవాజా వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు. "తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మావన హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో (పీఓకేను ఉద్దేశిస్తూ) దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్‌ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం" అని రణ్‌ధీర్ వెల్లడించారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్


| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

# ఏమిటీ 'బాస్ స్కామ్'?

### సైబర్ నేరగాళ్ల నయా మోసం..




**న్యూఢిల్లీ:** వ్యక్తులకు లింకులు పంపించడం, మాయ మాటలు చెప్పో.. భయపెట్టో వారి నుంచి అందినకాడికి దోచుకో వడం సైబర్ నేరగాళ్లు చేసే పని. ఇప్పుడు కేటుగాళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. బాస్ పేరిట సందేశాలు పంపిస్తూ పెద్ద మొత్తంలో దోచుకుంటున్నారు. ఈ తరహా మోసాల పట్ల వ్యక్తులు, కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది. ఇంతకీ ఏమిటీ బాస్ స్కామ్? ఎలా మోసగిస్తున్నారు? సైబర్ నేరగాళ్లు ఒక సంస్థలోని సీఈవో లేదా ఇతర ఉన్నతోద్యోగుల పేర్లను ఉపయోగించుకుని ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులను మోసం చేసే విధానాన్నే బాస్ స్కామ్ అంటారు. పై అధికారుల ఆదేశాలను సాధారణంగా ఉద్యోగులు తూ.చ. తప్పకుండా పాటిస్తుంటారు. దీన్నే ఆసరగా చేసుకుని కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బులు బదిలీ చేయించుకోవడం లేదా రహస్య సమాచారాన్ని తస్కరించడం ఈ స్కామ్ ముఖ్య ఉద్దేశం.

**ఎలా చేస్తారు?**

తొలుత సీఈవోలు, ఉన్నతాధికారులకు సైబర్ నేరగాళ్లు వల పన్నుతారు. ఆర్‌బీఐ వంటి ప్రభుత్వ నియంత్రణ సంస్థల పేరుతో కంపెనీ సీఈవోలకు వాట్సాప్ లేదా ఇ-మెయిల్ సందేశాలు పంపుతారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ ఒక జిప్ ఫైల్‌ను సెండ్ చేస్తారు. ఆ ఫైల్‌ను సీఈవో ఓపెన్ చేయగానే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుంది. చాలా కేసుల్లో సీఈవోలు ఆయా సందేశాలను తమ ఫైనాన్స్ ఆఫీసర్లకు పంపించినట్లు ఎ4అ పేర్కొంది. ఆ మాల్‌వేర్ ద్వారా సైబర్ నేరగాళ్లు వాట్సప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి, వారి అఫీషియల్ కమ్యూనికేషన్లను తమ అధీనంలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఆ నంబర్ నుంచి ఫైనాన్స్ టీమ్‌కు మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలని ఆదేశిస్తారు.

**ఎలా జాగ్రత్తపడాలి?**

వాట్సప్ లేదా ఇ-మెయిల్ ద్వారా డబ్బులు పంపాలని లేదా అకౌంట్ వివరాలు మార్చాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వస్తే వెంటనే వారికి నేరుగా ఫోన్ చేసి లేదా స్వయంగా కలిసి కనుక్కోవాలి. తెలియని సోర్సెస్ నుంచి వచ్చే ఫైల్స్ లేదా అటాచ్‌మెంట్లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఆర్‌బీఐ వంటి సంస్థలు ఎప్పుడూ వాట్సప్ వంటి మార్గాల ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు పంపించబోవని గుర్తుంచుకోవాలి. వాట్సప్‌లో మీ ప్రమేయం లేకుండా ఏవైనా ఇతర డివైజెస్ కనెక్ట్ అయి ఉన్నాయేమో ఎప్పటిప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. కంప్యూటర్లలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసిన యాంటీ-మాల్‌వేర్ టూల్స్ వాడాలి. అనధికారిక ఫైల్స్‌ను బ్లాక్ చేసేలా విండోస్ సిస్టమ్స్‌లో సెట్టింగ్స్ మార్చుకోవాలి.

## జన్యుపటంలో 74 చోట్లకు ఆదుర్దా లక్షణాలతో సంబంధం

దిల్లీ: మానవ జన్యుపటంలోని 74 చోట్ల ఉత్పన్నమయ్యే జన్యు వైరుధ్యాలకు ఆదుర్దా లక్షణాలతో సంబంధం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. వాటిలో 39.. ఈ సమస్యతో ముడిపడినట్లు కొత్తగా గుర్తించారు. ఆదుర్దాతో ఇంత పెద్ద జన్యు సంబంధాన్ని గుర్తించడం ఇదే తొలిసారి. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వీరు ఐరోపా మూలాలున్న దాదాపు 7 లక్షల మందికి సంబంధించిన జన్యుడేటాను విశ్లేషించారు. జీనోమ్ వైడ్ అసోసియేషన్ స్టడీ (గ్వాస్).. ఆదుర్దా లక్షణాలు తీవ్రంగా ఉన్నప్పుడు ఏ జన్యు వైరుధ్యాలు సర్వసాధారణంగా కనిపిస్తాయన్నది గుర్తించింది. జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, సామాజిక పరిస్థితులు, మానసిక అంశాలు.. జన్యువులతో కలిసి ఆదుర్దా ముప్పును నిర్దేశిస్తాయని ఈ పరిశోధన స్పష్టంచేస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే జన్యుముప్పు అధికంగా ఉన్నవారికి ఈ సమస్య ఉత్పన్నం కాకపోవచ్చని, అదే సమయంలో ముప్పు తక్కువగా ఉన్నవారిలో అది తలెత్తవచ్చని ఈ అధ్యయన ఫలితాలు చెబుతున్నాయని వివరించారు. "ఆదుర్దా రేటు పెరగడానికి పర్యావరణ అంశాలు ప్రధాన కారణమవుతున్నట్లు స్పష్టమవుతోంది. తరాల మధ్య జన్యువులు పెద్దగా మార్పునకు లోనుకావు. అందువల్ల జనంలో ఆదుర్దా సమస్యను పరిష్కరించడానికి పర్యావరణ అంశాలపై దృష్టిసారించాలి" అని పరిశోధనకు నాయకత్వం వహించిన మేగన్ స్కెల్టన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో జన్యు ముప్పును అర్థం చేసుకోవడం ద్వారా.. పర్యావరణ ప్రభావాలకు ఎక్కువగా ఎవరు లోనవుతారన్నది తెలుసుకోవచ్చని చెప్పారు.

## ఇరాన్‌కు అణ్వాయుధాలు దక్కనివ్వం

### ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జెరూసలెం:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తన ఆదేశాలను పాటిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ దేశ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. కొన్ని విషయాల్లో తమ మధ్య ఏకాభిప్రాయం లేదన్నారు. "ట్రంప్ నేను కోరుకున్నవన్నీ చేయరు. అలాగే ఆయన కోరుకున్నవన్నీ నేను చేయను. మేము స్వతంత్ర దేశాల నాయకులం. కొన్నిసార్లు మా అభిప్రాయాలు కలవవు. మా మధ్య ఏకాభిప్రాయం లేదు. అయినా మేము మా ప్రయోజనాల కోసం కలిసి నిలబడతాము. ఇజ్రాయెల్ ప్రయోజనాలు, భద్రత నాకు ముఖ్యం" అని జెరూసలెంలో నిర్వహించిన ఓ సదస్సులో నెతన్యాహు పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరినా, కుదరకపోయినా టెహ్రాన్‌కు తాము అణ్వాయుధం దక్కనివ్వబోమని నెతన్యాహు తేల్చిచెప్పారు. తాను ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నంత కాలం ఇరాన్ అణ్వాయుధాన్ని పొందే అవకాశం లేదని ఉద్ఘాటించారు. ఈ అంశంలో ఎలాంటి దౌత్య పరిణామాలు చోటుచేసుకున్నా సరే, తన నిర్ణయం మారదని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్‌సీ)లో రక్షణ వ్యవహారాల ఉప కార్యదర్శిగా ఉన్న ఘాదిర్ నెజామిపౌర్‌తో భారత జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ దిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. బ్రిక్స్ ఎన్ఎస్ఏల సమావేశంలో పాల్గొనేందుకు నెజామిపౌర్ భారత్‌కు వచ్చారు. యూరియా, డీఏపీ, సల్ఫర్ ఎరువులతో గతవారం హర్మూజ్‌ను దాటిన నాలుగు రవాణా నౌకలు భారత్‌లోని కృష్ణపట్నం, కాకినాడ, పారాదీప్, ముంద్రా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయని కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది.

## ధ్రువపు మంచు ఇక కరగదు

**వాషింగ్టన్(జనంసాక్షి):** భూగోళం వేడెక్కడంతో ధ్రువపు మంచు కరిగిపోతోంది. ఇది మానవాళి మనుగడకు అత్యంత ప్రమాదకరం. ఈ పరిస్థితిని నివారించడానికి శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. అందులో ఒకటి- కరిగిపోతున్న ఆర్కిటిక్ సముద్రాన్ని తిరిగి గడ్డకట్టించడం. బ్రిటన్ ప్రభుత్వ నిధులతో ఆండ్రియా సెకోలినీ కంపెనీ 'రియల్ ఐస్' నిర్వహిస్తున్న జియోఇంజినీరింగ్ ప్రయోగమిది. ఇది తొలిదశలోనే సత్ఫలితాలను ఇచ్చినట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు. రియల్ ఐస్ మాదిరిగానే ఆర్కిటిక్ రిఫ్లెక్షన్స్ అనే మరో సంస్థ సైతం ప్రయోగాలు చేపట్టి .. దాదాపు 45 సెం.మీ. వరకు ఓ మంచు పొరను ఉత్పత్తి చేసింది. దీంతో ఏదో ఒక రోజు ఆర్కిటిక్‌లోని గణనీయమైన భాగాన్ని తిరిగి గడ్డకట్టించడం సాధ్యమవుతుందన్న ధీమాను శాస్త్రవేత్తలు తమ ప్రయోగం ద్వారా కల్పిస్తున్నారు. వేసవిలో ఆర్కిటిక్ మంచు ఎక్కువ కాలం నిలిచిఉండేలా సముద్రపు నీటిని పంపింగ్ చేయడం ప్రాజెక్టులో ప్రధానాంశం. ఐదు నెలల క్రితం ఈ బృందం -40 డిగ్రీల ఉష్ణోగ్రతల్ని సైతం లెక్కచేయకుండా.. ఆర్కిటిక్ మంచుపై రంధ్రాలు చేసి.. దాని ఉపరితలంపైకి 50,000 టన్నుల సముద్రపు నీటిని పంప్ చేశారు. అది వెంటనే గడ్డకట్టి, 1.5 మీటర్ల లోతు ఉన్న మంచును సుమారు 50 సెంటీమీటర్ల మేర మందం చేసింది. కరిగేకాలం ప్రారంభంలోనే ఇది మంచును కాపాడింది. మంచులో ప్రతి 2 సెం.మీ. లోతులో ఉష్ణోగ్రత, లవణీయత మంచు నిర్మాణాన్ని శాస్త్రవేత్తలు కొలుస్తున్నారు. ఆర్కిటిక్‌లోని కేంబ్రిడ్జ్ బేలో గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో పంపులు మొత్తం 1,080 గంటల పాటు పనిచేసి, సుమారు 450 చదరపు మీటర్ల వైశాల్యం గల ప్రాంతాన్ని గడ్డకట్టించాయి.

## ఉక్రెయిన్ ధాటికి రష్యా ఉక్కిరిబిక్కిరి

మాస్కో(జనంసాక్షి): రష్యా రాజధాని మాస్కోకు ఉక్రెయిన్ మనశ్శాంతిని కరవు చేసింది. వరుస డ్రోన్ దాడులతో నగరం తగలబడుతోందా అన్న పరిస్థితి నెలకొంది. యుద్ధాన్ని ఏకంగా రష్యా రాజధాని గుండెల పైకి కీవ్ తీసుకొచ్చింది. మరోవైపు ఆక్రమిత క్రిమియాకు రష్యా ప్రధాన భూభాగం నుంచి ఎలాంటి సరకులు, ఇంధనం చేరకుండా ఉక్రెయిన్ కట్టడి చేస్తున్నాయి. దీంతో యుద్ధం సెగ రష్యాకు బలంగా తాకుతోంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు ఉత్పత్తి చేసే దేశాల జాబితా టాప్-3లో ఉండే రష్యా.. దేశీయంగా ఇంధన కొరత ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. రష్యా ప్రధాన భూభాగంలోని రోస్టవ్ ఆన్ డాన్ పట్టణం నుంచి ఆక్రమిత మారియుపోల్, మెలిటోపోల్ మీదుగా క్రిమియాకు వెళ్లే ప్రధాన హైవేను ఆర్-280గా పిలుస్తారు. ఈ మార్గం నుంచే సైనిక దళాలు, ఇంధనం, ఇతర సరకులు రష్యా ఆక్రమిత ప్రాంతాలకు చేరేవి. కెర్చ్ వంతెనపై దాడులు పెరగడంతో దానికి ప్రత్యామ్నాయంగా క్రెమ్లిన్ వ్యూహకర్తలు ఆర్-280 ఎంచుకొన్నారు. ఉక్రెయిన్ సైన్యంలోని 412 నెమిసోవ్ (గ్రీకు భాషలో ప్రతీకారానికి దేవత పేరు) బ్రిగేడ్‌లోని అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ ఫోర్స్ ఈ విషయాన్ని గ్రహించింది. అమెరికా తయారీ హార్నెట్ , స్థానికంగా తయారు చేసిన మోరిగన్ డ్రోన్లను వాడి భారీగా దాడులు చేసింది. ఫలితంగా ఈ మార్గంలో ఆర్-280 మీద ట్రాఫిక్ 70% పైగా పడిపోయింది. ట్యాంకర్లు, సైనిక వాహనాలు ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడిపోతున్నాయి. ముఖ్యంగా ఈ డ్రోన్లు రష్యాలోని ఓ హైవేను దాదాపు నిర్మానుష్యంగా మార్చేయడం గమనార్హం. ఇక ఎఫ్‌పీ-2, బెహెమోత్ డ్రోన్లను కూడా ఉక్రెయిన్ వాడుతోంది. ఇవి 50-300 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేదించగలవు. వీటి రాకతో మిడ్ రేంజిలో రష్యాపై దాడులు గతేడాది 28 రెట్లు పెరిగాయని అంచనా. ఇవి కేవలం లాజిస్టిక్స్‌నే కాకుండా రష్యా ఎయిర్ డిఫెన్స్‌లను కూడా దెబ్బతీస్తున్నాయి.

**చమురు క్షేత్రాలు, కర్మాగారాలే లక్ష్యం..**

యుద్ధం మొదలైన ఫిబ్రవరి 2022 నుంచి 2026 ఏప్రిల్ చివరి వారం వరకు ఉక్రెయిన్ దళాలు ఇంధన రిఫైనరీలే లక్ష్యంగా 158 దాడులు చేశాయి. వీటిల్లో రష్యాలోని అతిపెద్ద 33 రిఫైనరీల్లో కనీసం 24పై దాడులు చేశాయి. ర్యాజన్, సరటోవ్ రిఫైనరీలపై ఏకంగా దాదాపు 15 చొప్పున దాడులు జరిగాయి. సిజ్రాన్‌పై మే చివరికి 11వ సారి దాడి జరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి మే లోపు 16 చమురు శుద్ధి కర్మాగారాలు ఉక్రెయిన్ దాడుల్లో దెబ్బతిన్నాయి. ఈ దాడుల్లో రోజుకు 7,00,000 బ్యారెళ్ల రిఫైనింగ్ సామర్థ్యం పడిపోయింది. రష్యాలో చమురు శుద్ధి సామర్థ్యం 2009 తర్వాత తొలిసారి కనిష్ఠానికి పడిపోయింది. ఇక జనవరి నుంచి 30కి పైనున్న రిఫైనరీల్లో చూస్తే ఇది రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్లకు పైగా ఉత్పత్తిలో కోత పడినట్లైంది. ఉక్రెయిన్ దాడులు, చమురు శుద్ధి సామర్థ్యంలో అడ్డంకుల కారణంగా ముడిచమురు ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గింది. రోజుకు 4.6 లక్షల బ్యారెళ్ల ముడిచమురు తగ్గిందని పారిస్‌లోని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనా వేసింది.

**రష్యా నరాలను తెంపుతున్న డ్రోన్లు**

యుద్ధాల్లో దళాలకు అవసరమైన మందుగుండు, ఇంధనం, ఆహారం, బ్యాకప్ పంపడం చాలా ముఖ్యం. వీటిని కట్ చేస్తే ఎంతటి సైన్యమైనా కొన్ని వారాల్లో చేతులెత్తేస్తుంది. తాజాగా ఉక్రెయిన్ రష్యా విషయంలో లాజిస్టిక్స్ లాక్‌డౌన్ ప్లాన్ అమలుచేస్తోందని నిపుణులు అంటున్నారు. నేరుగా రష్యా దళాలపై దాడులు తగ్గించి.. వారి సరఫరాలను అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది.

## బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

నిర్మల్,జూన్23(జనంసాక్షి): బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా విచారణలో వెల్లడైంది.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీక్ పై ఆందోళన చేసిన రాహుల్ గాంధీ కి మద్దతుగా ఛత్రోస్ కి గుంజ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ద్వారా దేశ యువత భవిష్యత్తు దెబ్బతిందని, ఇది కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే అని అన్నారు. నీట్ ఇక పరీక్ష కాదు వేలంల మారింది అని అన్న రాహుల్ గాంధీ కి మద్దతుగా జిల్లాలో ఆందోళన చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టాపడి చదివిన దానికి న్యాయం జరగాలని, వ్యవస్థలు బాధ్యతతో వ్యవహారించాలని అన్నారు. ఢిల్లీ రాజధానిలో ఎంతో మంది విద్యార్థులు నీట్ పేపర్ లీక్ కు వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తున్నారని, యువకులు డిమాండ్ చేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి నైతిక భాద్యతతో రాజీనామా చేయాలన్నారు. దేశానికి భవిష్యత్తు యువకుల వల్లనే అని రాహుల్ గాంధీ కి యువకులు ప్రాధాన్యత ఇస్తున్నారని, వారికి ఏలాంటి కష్టం వచ్చిన ముందుండి పోరాటం చేస్తున్నారన్నారు. యువకులకు న్యాయం జరిగే విధంగా రాహుల్ గాంధీ ఆందోళన ఉధృతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నవీపేట్ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ నితిన్,కిష్టా గౌడ్, జావీద్, రాములు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

# 20 ఏళ్ల స్నేహం.. అయినా దొంగతనం

**గణేష్‌నగర్ ఇన్నోవా కార్ చోరీ కేసు ఛేదన**
**జోజిరెడ్డి సహా ఆరుగురు అరెస్ట్**
**భూవివాదాల నేపథ్యంలో పథకం ప్రకారం అపహరించిన నిందితులు**



**కరీంనగర్ టౌన్, జూన్ 23 ( జనం సాక్షి) :** కరీంనగర్ నగరంలోని గణేష్‌నగర్‌లో జరిగిన టయోటా ఇన్నోవా కార్ చోరీ కేసును కరీంనగర్-1 టౌన్ పోలీసులు ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. రామచందర్ రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు కల్లేపల్లి జానీ, ప్రధాన నిందితుడు యేరువా జోజిరెడ్డి గత 20 సంవత్సరాలుగా స్నేహితులు. ఇద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవారు. 2019లో జోజిరెడ్డి కొనుగోలు చేసిన టయోటా ఇన్నోవా కారును తన స్నేహితుడు జానీకి ఉపయోగించుకోవాలని ఇచ్చాడు. అయితే ఇటీవల భూవివాదాల కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. తన కారును తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా జానీ ఇవ్వకపోవడంతో, కారును తిరిగి స్వాధీనం చేసుకోవాలని జోజిరెడ్డి పథకం రచించాడు. ఈ క్రమంలో నీర్ల శివకృష్ణ, చెప్యాల రవికుమార్, ఆకుల రాజుకుమార్, కాసా సత్యరాజ్, రాపాక రాకేష్ అలియాస్ లడ్డుల సహాయంతో కారును అపహరించేందుకు కుట్ర పన్నాడు. జూన్ 17న సాయంత్రం గణేష్‌నగర్‌లో పార్క్ చేసి ఉన్న ఇన్నోవా కారును రెండో తాళం చెవితో తీసుకెళ్లారు. కారులో ఉన్న రూ. 42 వేల నగదు, శాంసంగ్ గెలాక్సీ ఫోల్డ్-4 మొబైల్ ఫోన్, రూ. 20 లక్షలు, రూ. 10 లక్షల విలువలతో రాసి ఉన్న రెండు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెక్కులు, చెక్‌బుక్, కేడీసీసీ బ్యాంకు పాస్‌బుక్‌ను కూడా అపహరించారు. చోరీ అనంతరం నిందితులు వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో సంచరించి, కారును విజయవాడలో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్ బైపాస్‌లోని ఆటోనగర్ సమీపంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులు యేరువా జోజిరెడ్డి, నీర్ల శివకృష్ణ, చెప్యాల రవికుమార్, ఆకుల రాజుకుమార్, కాసా సత్యరాజ్, రాపాక రాకేష్ ఏ లడ్డులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన ఇన్నోవా కారు, రూ. 42 వేల నగదు, మొబైల్ ఫోన్, రెండు బ్యాంకు చెక్కులు, హెచ్‌డీఎఫ్‌సీ చెక్‌బుక్, కేడీసీసీ బ్యాంకు పాస్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి**
**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 23 (జనంసాక్షి);** ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి కిచెన్ లోకి వెళ్లి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో పప్పులు,నూనె, నెయ్యి,ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యాలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. ఇట్టి పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి,తహసీల్దార్ నారాయణ రెడ్డి,సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

# ఎల్లంపేట గ్రామంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటన

**పల్లె దవాఖాన, వనమహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్**

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 23 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా గ్రామంలోని పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్, అవుట్ పేషంట్ (ఓపీ) రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.
అనంతరం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఎల్లంపేట గ్రామానికి చెందిన శ్రీమతి బుద్ది నవీన (భర్త: స్వామి)ను అభినందించి, ప్రభుత్వం తరపున గుర్తింపుగా గోడ గడియారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

**ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి.. కలెక్టర్‌తో కలిసి నవీపేటలో స్థల పరిశీలన**



**ఎడపల్లి, జూన్ 23 (జనంసాక్షి) :** విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు, అధునాతన సౌకర్యాలతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట ఒకటవ తరగతి నుండి 12 తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. కాగా, అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు ప్రశ్నలు వేస్తూ, విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు, బహుమతులు అందించి ప్రోత్సహించారు. వీరి వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.



## ఆటోనగర్‌లో ఆటో కార్మికులకు ఇళ్ల పట్టాలు

**బోధన్, జూన్ 23 (జనంసాక్షి) :** బోధన్ ఆటోనగర్‌లో మంగళవారం ఆటో యూనియన్ కార్మికులకు బోధన్ ఆర్డీఓ ఆఫీస్ లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ ఫలాలుప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అర్హులైన ఆటో కార్మికులకు ఇళ్ల పట్టాలను అందజేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆటో కార్మికులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, సొంత ఇంటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించేలా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందని తెలిపారు. ఇళ్ల పట్టాలు అందుకున్న ఆటో కార్మికులు తమకు ఎంతోకాలంగా ఉన్న సొంత ఇంటి ఆశ నెరవేరినందుకు ఎమ్మెల్యే సుధర్శన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్ డి ఓ విజయ్ కుమార్ గారు మరియు బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశారత్ రెడ్డి గారు మరియు మిగతా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (జనంసాక్షి) :** దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాతి ఐక్యత కోసం ఒక దేశం, ఒక చట్టం, ఒక రాజ్యాంగం అని నినదించిన మహనీయుడు అని కొనియాడారు. కేవలం రాజకీయనేతనే కాకుండా విద్యావేత్తగా, దార్శనికుడిగా జాతీయ సమగ్రత కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. స్వాతంత్రం తర్వాత కాశ్మీర్ కు ప్రత్యేక జెండా ప్రత్యేక రాజ్యాంగం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీంతో 1953లో “ఒక దేశంలో రెండు చట్టాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని కాశ్మీర్ లోకి అడుగుపెట్టారన్నారు. అప్పుడే అనుమానాస్పదంగా మరణించి దేశం కోసం నిలిచారన్నారు. అప్పటినుంచి జూన్ 23ను బలిదాన్ దివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి యువత దేశం కోసం చదవాలని, దేశం కోసం బ్రతకాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బెల్లాల్ శశాంక్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, బొబ్బిలి సువర్ణ వేణు, కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, ప్రసన్న సత్యపాల్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఆనంద్ రావు, భూపతి, బాబీ సింగ్, సీనియర్ నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సన్న రకాలు సాగుచేయండి

**విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల బ్యూరో జూన్ 23 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం గా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భీమ సంతోష్,వైస్ చైర్మన్ పుర పాటి రాజి రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కార్యదర్శి, స్థానిక సర్పంచ్ శోభన్,మార్కెట్ డైరెక్టర్లు వివిధ గ్రామాల సర్పంచులు మండల వ్యవసాయ అధికారి మండల అధికారులు నాయకులు పాల్గొన్నారు

# కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి



**కరీంనగర్ బ్యూరో, జూన్ 23 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రోజు ఉదయం కొత్తపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బావుపేట గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 3 భారీ ఇసుక డంపులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ మూడు డంపుల్లో (50ం15ం10) మొత్తం 75 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఈ ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదేవిధంగా, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సదరు ట్రాక్టర్‌ను తదుపరి చట్టపరమైన చర్యల కోసం రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై కమీషనరేట్ వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో కూతుర్ని చేర్పించిన సర్పంచ్

**బోధన్, జూన్ 23 (జనంసాక్షి ) :** సాలూర మండలం మందర్న గ్రామ సర్పంచ్ రావుబా సావిత్రి గంగాధర్ మంగళవారం తన కూతురు ఆర్ దివ్యను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రావుబా సావిత్రి గంగాధర్ కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శిరీష ప్రహ్లాద్, మహిళా సంఘం అధ్యక్షులు కుక్కలుగే శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత తదితరులు పాల్గొన్నారు.





# సీలింగ్ భూముల పరిశీలన చేసిన కలెక్టర్

**ముత్తారం జూన్ 23(జనంసాక్షి):** ముత్తారం మండలం ఓడేడ్ గ్రామపంచాయతీ పరిధిలో వెంకటేశ్వర్లపల్లి గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వం భూములను పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష మంగళవారం పరిశీలించారు. సీలింగ్ చట్టం ప్రకారం అదనంగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాల స్థితిగతులపై కలెక్టర్ ఈ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలోని సర్వే నెం. భూములను అధికారులు గుర్తించాలన్నారు. భూమి ప్రభుత్వ పేదలకు అనుకూలంగా ఉండే విధంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్,జిపివో,సర్వే తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# నల్లచెరువు వద్ద బస్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జూన్ 23 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నల్లచెరువు ప్రాంతంలో ప్రతిపాదిత బస్ టెర్మినల్ స్థలంతో పాటు నల్లచెరువు అభివృద్ధి పనులు, బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఉప్పల్, కాప్రా, కుషాయిగూడ, నాచారం, హబ్సిగూడ, రామంతాపూర్, బోడుప్పల్ ప్రాంతాల ప్రజలకు బస్ టెర్మినల్ ద్వారా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనను ఇప్పటికే సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో కార్యరూపం దాల్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. స్థానికులు బస్సుల కొరత, ట్రాఫిక్ సమస్యలు, ప్రయాణ ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బస్ టెర్మినల్ ఏర్పాటుతో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. నల్లచెరువు అభివృద్ధి, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే పర్యావరణ పరిరక్షణతో పాటు రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

# రూరల్ ఎంఈఓ అర్బన్ అవతారం

- కార్పొరేట్ స్కూళ్లకు ఏజెంట్‌గా లక్ష్మణ్ సింగ్
- లేని పోస్టును క్రియేట్ చేసుకుని మరీ విధులు
- పాలమూరులో రూరల్ విద్యావ్యవస్థ నిర్వీర్యం
- ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ సేవలు
- సీఎంఓ గడప తొక్కిన యంఈఓ లక్ష్మణ్ సింగ్ అక్రమాల చిట్టా!



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఒక అధికారి ఇష్టారాజ్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్నచింతకుంట నుంచి మహబూబ్‌నగర్ రూరల్ ఎంఈఓగా బదిలీపై వచ్చి, ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన ఎంఈఓ లక్ష్మణ్ సింగ్.. రూరల్ బాధ్యతలను గాలికొదిలేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా, అర్బన్ పరిధిలో అసలు ఉనికిలోనే లేని ఒక పోస్టును సొంతంగా క్రియేట్ చేసుకుని, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధిగా అవతారమెత్తడం విద్యాశాఖ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ అక్రమ నియామకం వెనుక గతంలో పెద్ద ఎత్తున మాములు విద్యాశాఖలో చేతులు మారాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**జీతం ప్రభుత్వానిది.. సేవలు ప్రైవేటుకు**

రూరల్ ఎంఈఓ పోస్టుకు గాను ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రతి నెలా ప్రభుత్వ వేతనాన్ని అందుకుంటున్న సదరు అధికారి లక్ష్మణ్ సింగ్ , విధులను మాత్రం మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల కోసం కేటాయించడం గమనార్హం. జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ పాఠశాలల అనుమతుల వ్యవహారంలో ఈయన ఒక ప్రైవేట్ ఏజెంట్‌లా మారి చక్రం తిప్పుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ యాజమాన్యాలకు కొమ్ముకాస్తూ, ప్రభుత్వ విద్యావ్యవస్థను దెబ్బతీసేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**గాల్లో 5900 మంది పేద విద్యార్థుల భవిష్యత్తు!**

మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో సుమారు 38 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సుమారు 5,900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పూర్తిస్థాయి ఎంఈఓ ఉండి పర్యవేక్షించాల్సిన చోట, లక్ష్మణ్ సింగ్ అర్బన్ విధుల్లో మునిగిపోవడంతో రూరల్ పాఠశాలల వ్యవస్థ పూర్తిగా పడకేసింది. దీనికి ప్రత్యామ్నాయంగా ధర్మపూర్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణయ్య అనే వ్యక్తికి రూరల్ ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటు స్కూల్ బాధ్యతలు, ఇటు ఎంఈఓ బాధ్యతలు నిర్వహించడం పనికిమించిన భారంగా మారడంతో, సదరు ఇన్‌చార్జ్ ఎంఈఓ కృష్ణయ్య తన బాధ్యతలకు రాజీనామా చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులకు లేఖ సమర్పించడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

**సీఎంఓ కార్యాలయానికి చేరిన అక్రమాల చిట్టా!**

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సాగుతున్న ఈ అక్రమ నియామకం మరియు అవినీతి వ్యవహారాలపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే ఈ అధికారి అక్రమాలపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ పాఠశాలల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సదరు ఎంఈఓపై తక్షణమే విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో సియంఓ కార్యలయం నుంచి సైతం సీక్రెట్ విచారణ సాగుతున్నట్లు సమాచారం.

# ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ ఉక్కుపాదం

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
## 10 చోట్ల ఏకకాలంలో సోదాలు, అరెస్టు



**అల్వాల్, జూన్ 23(జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) బుధవారం ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు అనంతరం కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేశారు. అల్వాల్‌లోని మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన ప్రాంగణాల్లో చేపట్టిన సోదాల్లో నాలుగు లగ్జరీ ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, ఎనిమిది ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అల్వాల్ నివాసంలో రూ. 3.31 లక్షల నగదు, రూ. 50 లక్షల బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై మూడు బ్యాంకు లాకర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి పరిశీలన అనంతరం మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాల విలువ ప్రభుత్వ మార్గదర్శక విలువ ప్రకారం సుమారు రూ. 3 కోట్లుగా ఉందని, బహిరంగ మార్కెట్ విలువ పదుల కోట్ల రూపాయలు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నామని, తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అరెస్టు చేసిన కొమ్మూరి మల్లారెడ్డిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.

# పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

## జేఏసీ నూతన చైర్మన్‌గా మిద్దెల సత్యనారాయణ

**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి)**







పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కమిటీ నూతన చైర్మన్‌గా మిద్దెల సత్యనారాయణ గౌడ్, కన్వీనర్ గా టీజీ.శ్రీనివాస్, కోఆర్డినేటర్‌గా పవన్ చౌహాన్, కో చైర్మన్‌లుగా మందారం నర్సింలు, బుద్దుల జంగయ్య, బిజిలి సత్యం, వెంకటేష్ శివ, కో కన్వీనర్లుగా రవీంద్రనాథ్, తిరుమలయ్య, అర్జునప్ప రాజు తదితరులు ఎన్నికయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీలో భాగంగా షాద్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టు సాధన జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులతో పాటు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఈ ప్రాంత రైతాంగానికి సాగు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కమిటీ పని చేస్తుందని సభ్యులు తెలిపారు.

**వరద సమస్యతో**

# వెంకటేశ్వర కాలనీలో హైడ్రా కమిషనర్ పర్యటన



**రాజేంద్రనగర్,జూన్ 23(జనంసాక్షి) :** భారీ వర్షాల సమయంలో శ్రీ వేంకటేశ్వర కాలనీ ప్రవేశ ద్వారం వద్ద నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు, రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను సిటిజెన్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంగళవారం కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. కాలనీలోని సమస్యాత్మక ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషనర్ రంగనాథ్, నీరు నిలిచిపోయే సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో వర్షాకాలంలో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అమలు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎలేట్ స్కూల్ సమీపంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 60 అడుగుల రహదారిని తెరవడానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు సులభతరమై ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్, నార్సింగ్ డివిజన్ ఏఈ సంతోష్, కాలనీ సభ్యులు సుజాత, లక్ష్మి, జ్ఞానేశ్వరి, స్వాతి, అఖిల్, అష్రఫ్, నరసింహ రెడ్డి, సమర్ రెడ్డి, సాగర్, మాజీ కౌన్సిలర్ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో విష రసాయనాల కలకలం

## వ్యర్థాల డంపింగ్‌తో మాడిపోయిన చెట్లు, పచ్చిక బయళ్లు
## భయాందోళనలో రైతులు, పశువుల కాపరులు



**బంట్వారం, జూన్ 22 (జనంసాక్షి):** తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో గుర్తుతెలియని వ్యక్తులు విషపూరిత రసాయన వ్యర్థాలను డంప్ చేయడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. తొరుమామిడి--మగ్దంపూర్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఈ ఘటన రైతులు, పశువుల కాపరులను భయాందోళనకు గురిచేస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, రెండు రోజుల క్రితం రసాయన వ్యర్థాలను అక్కడ కుమ్మరించారు. మొదటి రోజు ఆ ప్రాంతానికి సమీపంలోకి వెళ్లలేనంత తీవ్ర దుర్వాసన రావడంతో ప్రజలు దూరంగా వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. రసాయనాలు చల్లిన ప్రాంతంలో పచ్చిక గడ్డి, చెట్లు పూర్తిగా మాడిపోవడంతో వాటి తీవ్రత స్పష్టమవుతోందన్నారు. ఈ ప్రాంతానికి ఆనుకుని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వ్యవసాయ భూములు ఉండటంతో పాటు పశువుల మేత భూములు కూడా ఉన్నాయి. దీంతో పశువులు, అడవి జంతువులు సంచరించే ప్రాంతంలో విషపూరిత వ్యర్థాలు డంప్ చేయడం పర్యావరణానికి, జీవరాశులకు ముప్పుగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కర్ణాటక అటవీశాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ ప్రారంభించారు. గతంలో కూడా బోనస్పూర్ పరిసర ప్రాంతాల్లో విష రసాయనాల ప్రభావంతో వాగుల్లో చేపలు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తుచేశారు. సంఘటన స్థలాన్ని ఫారెస్ట్ సెక్షన్ అధికారి వెంకటేశ్ నాయక్, మెడికల్ ఆఫీసర్ బాలాజీ తదితర అధికారులు సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రసాయన వ్యర్థాల మూలాలను గుర్తించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# భారీ వర్షంతో ఉప్పొంగిన ఈసీవాగు

## జలమయమైన పంట పొలాలు



**మొయినాబాద్ (జనంసాక్షి) :** భారీ వర్షం కురియడంతో వాగులు, వంకలు ప్రవహిస్తు ఈసీ వాగు వరవళ్లు తొక్కింది. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పంట పోలాలు జలమయమైయ్యాయి. వాగులు, వంకలు ప్రవహిస్తు వరవళ్లు తొక్కాయి. మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపాన గల ఈసీవాగు తెల్లవారుజామున ఉధృతంగా ప్రవహించింది. మూడు గంటలు తరువాత నిదానంగా నీటి మట్టం తగ్గిపోయింది. ఈ ఈసీవాగులోని వరద నీరంతా హిమాయత్ సాగర్ చెరువులోకి చేరుతుంది. అదే విధంగా కురిసిన భారీ వర్షానికి అమాపూర్ సమీపంలో వ్యవసాయ పోలంలో ఉన్న భారీ గోడ నెలపై కూలింది. మండల పరిధిలోని ఆయా గ్రామల సమీపంలో ఉన్న చిన్న వాగులు, వంకలు నీటితో కళకళలాడుతూ సంతరించుకుంది. పంట పోలాలలో భారీగా వర్షం నీరు చేరింది. కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. ఈసీ వాగు ప్రవాహాన్ని చూసేందుకు చుట్టు పక్కల ప్రజలు వచ్చి తిలకించారు.

# వెన్నెముక శస్త్రచికిత్సపై అపోహలు వద్దు

## మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో విజయవంతమైన వెన్నెముక స్థిరీకరణ శస్త్రచికిత్స
### 53 ఏళ్ల మహిళకు మళ్లీ నడిచే అవకాశం కల్పించిన వైద్యులు





**ఇబ్రహీంపట్నం, జూన్ 23 (జనం సాక్షి):** వెన్నెముక శస్త్రచికిత్స చేస్తే పక్షవాతం వస్తుందనే అపోహలను మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఖండించారు. హైదరాబాద్‌కు చెందిన ఏలేటి విమల (53) తీవ్ర నడుము నొప్పి, కుడికాలి నొప్పి, రెండు కాళ్లలో తిమ్మిర్లు, మొద్దుబారడం కారణంగా నడవలేని స్థితికి చేరుకున్నారు. ఆసుపత్రిలో నిర్వహించిన ఎమ్మార్ఐ పరీక్షల్లో వెన్నెముకలో బహుళ స్థాయిల్లో నరాలపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారు. యశోదా ఆసుపత్రి సీనియర్ వెన్నెముక, నాడీ శస్త్రచికిత్స నిపుణుడు డా. శ్రీనివాస్ బొట్ల ఆధ్వర్యంలో క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రత్యేక స్క్రూలు, టైటానియం రాడ్లతో వెన్నెముకను స్థిరపరిచారు. నరాలపై ఉన్న ఒత్తిడిని పూర్తిగా తొలగించారు. అనంతరం ఫిజియోథెరపీ, పునరావాస సేవలు అందించడంతో రోగి నడుము, కాలి నొప్పుల నుంచి ఉపశమనం పొంది ప్రస్తుతం ఎలాంటి సహాయం లేకుండా స్వతంత్రంగా నడుస్తున్నారు. సకాలంలో సరైన వైద్యం తీసుకుంటే వెన్నెముక సమస్యలకు సమర్థవంతమైన చికిత్స సాధ్యమని డా. శ్రీనివాస్ బొట్ల తెలిపారు.

ఈ విజయంపై యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర హర్షం వ్యక్తం చేశారు. అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం వల్లే ఇలాంటి క్లిష్ట కేసుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు.

# తాడ్వాయిలో తీవ్ర ఉద్రిక్తత

## పెట్రోల్ బాటిళ్లతో రోడ్డుపైకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు
## మాజీ ఎమ్మెల్యే సురేందర్ అరెస్టు

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 23 (జనంసాక్షి)**

తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యూరియా యాప్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ తాడ్వాయి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నాకు పిలుపునివ్వడంతో తీవ్ర ఆందోళనకరమైన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ధర్నా ను ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వకుండా నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో పోలీసులు ఎల్లారెడ్డి, కామారెడ్డి రోడ్డుపై పెద్ద సంఖ్యలో మొహరించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ పంపించారు. రోడ్డుపై కనిపించిన అనుమానస్తులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఎల్లారెడ్డి,కామారెడ్డి రోడ్డుపై కృష్ణాజివాడి, దేవాయపల్లి,ఎర్ర పహాడ్,తాడువాయి రోడ్డులో దేమి కలాన్, చందాపూర్, చిట్యాల రోడ్డుల లో పోలీసులు మోహరించి మహారా కాషారు.

**పెట్రోల్ డబ్బాలతో రోడ్డుపైకి..**

తాడ్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి కామారెడ్డి రోడ్డుపై పాత బస్టాండ్ వద్దకు ఒక్కసారిగా తాడువాయి సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు నర్సింలు పెట్రోల్ డబ్బాలతో వచ్చి నిరసన తెలిపే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇద్దరి వద్ద ఉన్న పెట్రోల్ డబ్బాలు లాక్కొని వెంటనే వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోలీసులు అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే యూరియా యాప్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తాము న్యాయంగా నిరసన తెలపడం కోసం వస్తే పోలీసులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అరెస్టులు చేసినా తమ నిరసనను ఆపలేరని హెచ్చరించారు. ఇద్దరు నాయకులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్ళి జీపుల్లోకి తోసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

**ఒక్కసారిగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్**

ఎల్లారెడ్డి,కామారెడ్డి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం యూరియా యాప్ ను ఎత్తివేయాలంటూ నినాదాలు చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై సురేందర్‌ను అరెస్టు చేసి జీపులోకి ఎక్కించారు. వెంటనే పోలీస్ స్టేషన్ కు తరలించారు. తమ అరెస్టులతో రైతుల ఇబ్బందులను ఆపలేరని సురేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల కష్టాలను పరిగణలోకి తీసుకొని యాప్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తాడువాయి మండల కేంద్రంలో ఎట్టి పరిస్థితుల్లో ధర్నాను జరగనివ్వకూడదనే లక్ష్యంతో పోలీసులు మంగళవారం ఉదయం 3 గంటలకే బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేసి దోమకొండ, కామారెడ్డి, గాంధారి, తాడువాయి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆయా గ్రామాల్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకుల కోసం గాలింపు చేపట్టారు. ఎవరు దొరికితే వారిని జీపులలో, వ్యాన్లలో పోలీస్ స్టేషన్లకు తరలించి వేషారు.







**పోలీసుల అప్రమత్తతో తప్పిన భారీ ప్రమాదం**

పెట్రోల్ డబ్బాలతో వచ్చిన నాయకులనుంచి పోలీసులు వెంటనే అప్రమత్తమై పెట్రోల్ డబ్బాలను లాక్కోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిపోయింది. కొంచెం ఆలస్యమైనా చాలా ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వాపోతున్నారు. పెట్రోల్ డబ్బాల మూతలు తెరుచుకోవడంతో అక్కడ ఉన్న పోలీసులపై నాయకుల పై పెట్రోల్ చిల్లింది. నాయకుల అరెస్టులతో ధర్నా కార్యక్రమం సద్దుమణిగింది. తాడ్వాయి మండల కేంద్రంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రావడానికి ముందస్తుగానే పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను ఇంట్లోనే హౌస్ అరెస్టు చేసి ధర్నాకు రాకుండా చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24 జూన్ 2026




## హైదరాబాద్‌లో కాన్సులేట్ రోడ్డుకు
# ట్రంప్ పేరు పెట్టొద్దు

**బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వామపక్షాల నిరసన ర్యాలీ**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ సమీప రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం దుర్మార్గమని వామపక్ష నేతలు విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ (బషీర్‌భాగ్) విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ఆ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. 'హైదరాబాద్ రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడం సిగ్గు సిగ్గు, యుద్ధోన్మాది ట్రంప్ పేరును వెనక్కి తీసుకోవాలి.రాష్ట్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేక ప్రభుత్వ నిర్ణయం డౌన్,డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతర అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సభలో సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మహేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, మహేశ్, ఎస్ఎల్ పద్మ, సుధాకర్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రపంచ యుద్ధోన్మాది ట్రంప్ పేరును హైదరాబాద్ రోడ్డుకు పెట్టడమేంటని ప్రశ్నించారు. ఎందుకు ఆయన పేరు పెడుతున్నారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ప్రపంచ దేశాలపై యుద్ధాలు చేస్తున్నందుకా? మన దేశంపై ఆర్థిక ఆంక్ష?లు విధించినందుకా? ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

## హైదరాబాద్‌కు మీరు డెవలప్‌మెంట్ సెంటర్ ఇస్తే..
# మేం గ్లోబల్ సీఈఓలను ఇస్తాం

- హైదరాబాద్‌కూ అమెరికాకూ ఉన్న దౌత్య సంబంధం కాదు
- ఇది ప్రజల మధ్య, కుటుంబాల మధ్య ఏర్పడిన అనుబంధం
- ప్రతి తెలుగు ఇంట్లోనూ అమెరికా ఒక భాగమైంది
- ఐటీ నుంచి ఏఐ, క్లీన్ ఎనర్జీ వైపు తెలంగాణ-యుఎస్ అడుగులు
- హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడటంలో అమెరికా సహకారం అభినందనీయం
- అమెరికా 'ఫ్రీడమ్ 250' వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'హైదరాబాద్ ఐటీ రంగానికి మీరు డెవలప్‌మెంట్ సెంటర్ ఇస్తే.. మేము మీకు ప్రపంచాన్ని నడిపించే గ్లోబల్ సీఈఓలను ఇస్తాం' అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని యు.ఎస్. కాన్సులేట్‌లో నిర్వహించిన 'ఫ్రీడమ్ 250' వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 1990లలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌లో అడుగుపెట్టడం నుంచి.. నేడు సత్య నాదెళ్ల ఆ సంస్థకు సీఈఓగా ఎదగడం వరకు ఉన్న ప్రయాణాన్ని గుర్తుచేస్తూ, తెలుగు వారి నైపుణ్యానికి ఇదొక నిదర్శనమని ఆయన కొనియాడారు. 'హైదరాబాద్‌కూ అమెరికాకూ ఉన్న బంధం కేవలం రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న దౌత్య సంబంధం కాదు. ఇది ప్రజల మధ్య, కుటుంబాల మధ్య ఏర్పడిన అనుబంధం. ఈ రోజు మన ఇళ్లలో అమెరికా అనేది మ్యాప్‌లో చూసే ఒక దేశం కాదు. అక్కడ చదువుకుంటున్న మన పిల్లలు, ఉద్యోగాలు చేస్తున్న బంధువులు, స్టార్టప్‌లు పెడుతున్న యువత రూపంలో అమెరికా ప్రతి తెలుగు ఇంట్లో ఒక భాగమైంది. ఇప్పుడు మనం అమెరికాకు వెళ్తున్నాం అని కాదు, తెలుగే నేరుగా అమెరికాకు వెళ్లిపోయింది. అక్కడ వేగంగా విస్తరిస్తున్న భాషగా తెలుగు నిలవడం మనందరికీ గర్వకారణం' అని అన్నారు. 'తెలంగాణ-అమెరికా భాగస్వామ్యం ఇప్పుడు కేవలం సాఫ్ట్‌వేర్ రంగానికే పరిమితం కాలేదు. అది దాటి 'సహసృష్టి' దశలోకి అడుగుపెట్టింది. జీవవిజ్ఞానం (లైఫ్ సైన్సెస్), వ్యాక్సిన్ల తయారీ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో మన బంధం మరింత గట్టిపడింది. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ), ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో ఈ భాగస్వామ్యం మరిన్ని కొత్త పుంతలు తొక్కబోతోంది' అని వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2025లో మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా.. అమెరికాతో ఉన్న ప్రత్యేక బంధానికి గుర్తుగా ఇక్కడి యు.ఎస్. కాన్సులేట్ సమీపంలోని ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని నిర్ణయించాం' అని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆ రహదారి పేరు ఫలకాన్ని ఆవిష్కరించేందుకు వేదికపై ఉన్న అమెరికా రాయబారి సెర్జియో గోర్, కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌లను ఆయన ఆహ్వానించారు. దెక్కన్ సంస్కృతి ఉట్టిపడేలా నిర్మించిన యు.ఎస్. కాన్సులేట్ కొత్త భవనం సాంస్కృతిక దౌత్యానికి ప్రతీక అని, హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడటంలో అమెరికా అందిస్తున్న సహకారం అభినందనీయమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## జంటహత్యల కేసులో విస్తుపోయే విషయాలు
### స్నేహితుల మధ్య ఈఎంఐ చిచ్చే కారణం

**మెదక్, జూన్23 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సురారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులైన శ్రీధర్, ప్రభు (ప్రభాకర్) మధ్య ఉన్న చిన్నపాటి ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలే ఈ దారుణ హత్యలకు దారితీశాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభు గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ ఒక ఆటోను ఈఎంఐ పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, రెండు నెలల ఈఎంఐ బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా, అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ ఒకచోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒకరికొకరు లొకేషన్లు షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలవడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, హల్దీవాగు నుంచి వెలికితీసిన యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ జంట హత్యల నేపథ్యంలో సురారం గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ

- సిఎం విజయ్‌ను ఉద్దేశిస్తూ.. ఉదయనిధి కౌంటర్

**చెన్నై, జూన్23 (జనంసాక్షి) :** తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా జరిగాయి. హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన, రైతుల నిరసన అంశాలను మంగళవారం సీఎం విజయ్ ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వారి ఉచ్చులో రైతులు పడదని తెలిపాడు. అలానే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అర్థం చేసుకొని, మద్దతు ఇవ్వాలని రైతులను సీఎం కోరారు. విజయం చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్ స్పందించాడు. తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రసంగానికి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ ఇస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగారు. సీఎం విజయ్-సంగీత విడాకుల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతుకుతున్న కథ రాష్ట్రానికి తెలుసని ఉదయనిధి స్థాలిన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే రైతులు నిరసన తెలుపుతున్నారని విజయ్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపాడు. చిన్న స్టోరీ చెప్తానంటూ విజయ్ చేసిన వ్యాఖ్యలు రైతుల గౌరవానికి భంగం కలిగించేవిగా ఉన్నాయని ఉదయ్ నిధి స్టాలిన్ పేర్కొన్నాడు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతికే కథ మాత్రమే తమిళనాడు ప్రజలకు తెలుసంటూ సీఎం విజయ్ పై ఉదయనిధి వ్యక్తిగత విమర్శలు చేశారు.

## పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

- స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు
- అధికారులతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, జూన్23 (జనంసాక్షి) :** పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు.

## అదనపు కట్నం వేధింపులు

- అత్తగారింటి ముందు కోడలు టెంట్ వేసి ధర్నా

**మేడ్చల్, జూన్23 (జనంసాక్షి) :** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాష్ హిల్స్‌లో ఓ మహిళ తన అత్తగారింటి ముందు టెంట్ వేసుకుని ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జయశ్రీ (25) అనే మహిళ తన భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ఈ నిరసనకు దిగినట్లు తెలిపింది. బాధితురాలి కథనం ప్రకారం, వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నంతో పాటు ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త కుటుంబ సభ్యులు నిరంతరం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అదనపు డబ్బు తీసుకురావాలని ఒత్తిడి చేయడమే కాకుండా, ఎదురు తిరిగి మాట్లాడితే మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వ్యభిచారం చేస్తోందంటూ ముద్రవేసి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొంది. ఈ విషయమై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో భర్త ఇంటిముందు బంధువులతో కలిసి ధర్నా దిగింది.

# కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు

- ప్రియుడితో కలిసి కాబోయే భార్య సియా మర్డర్ ప్లాన్
- లోయలోకి తోసి హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ
- సియాను, ప్రియుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ముంబై, జూన్23 (జనంసాక్షి) :** మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విశాల్ అగర్వాల్ కుమారుడు కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు కలిసే కేతన్‌ను లోయలోకి తోసేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే అమ్మాయితో కొన్ని రోజుల క్రితం పెళ్లి నిశ్చయం అయింది. నవంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం సియా పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా సియ, కేతన్ లోనావాలాకు ట్రెక్కింగ్‌కు వెళ్లారు. లోహగడ్ కోటకు వెళుతుండగా కేతన్ లోయలో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కేతన్ లోయలో పడిపోయాడని సియా పోలీసులకు చెప్పింది. 3 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత లోయలో కేతన్ శవాన్ని కనుగొన్నారు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లోనావాలా రూరల్ పోలీసులు సియాను విచారించగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పటం మొదలెట్టింది. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్ సేకరించటంతో పాటు సంఘటనా స్థలంలో ఉన్న జనాలను విచారించారు. దీంతో ఆమెపై అనుమానం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే సియాను, ఆమెను ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు పక్కా ప్లాన్‌తో కేతన్‌ను మర్డర్ చేసినట్లు తేలింది. ఇద్దరూ కలిసి కేతన్‌ను లోయలో తోసేశారని వెల్లడైంది. ఈ మర్డర్ ఇద్దరే చేశారా? లేక వారికి ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో కూడా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. కేతన్‌ను పెళ్లి చేసుకోవటం సియాకు ఏమాత్రం ఇష్టం లేదు. ఆమె చేతన్ చౌదరీని ప్రేమిస్తోంది. ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో కలిసి పని చేస్తున్నారు. ప్రియుడి సాయంతో కేతన్ అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ పక్కా ప్లాన్ వేసుకున్నారు. సియా తన పుట్టిన రోజున కేతన్‌ను లోహగడ్‌కు ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లింది. సరైన సమయం దొరకగానే తన ప్రియుడు చేతన్ సాయంతో కేతన్‌ను లోయలోకి తోసేసింది. కేతన్ ప్రమాదవశాత్తు లోయలో పడిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. దర్యాప్తులో ఆమె చేసిన నేరం బయటపడింది. కొడుకు పెళ్లి కోసం విశాల్ అగర్వాల్ ఇప్పటికే 20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పెళ్లి నవంబర్ నెలలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగాల్సి ఉంది. విశాల్ 17 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెళ్లి కోసం ఇప్పటికే ప్యాలెస్ బుక్ చేశాడు. అంతేకాదు.. బంధుమిత్రులను, అతిథులను తరలించడానికి విమానాలను కూడా బుక్ చేశాడు. పెళ్లికి ఇంకా ఐదు నెలలు ఉన్నా కూడా ఇప్పటినుంచే రెండు కుటుంబాల వారు పెళ్లి పనులు మొదలెట్టారు. సియా చేసిన దారుణం కారణంగా రెండు కుటుంబాల వారు షాక్‌లో ఉన్నారు.

# వరుస తనిఖీలు చేసినా కానరాని మార్పులు

- రెస్టారెంట్లలో అదే అపరిశుభ్రత..
- ఫ్రీజర్లలో కాలం చెల్లిన పదార్థాలు
- కంచి కేఫ్, కోడికూర చిట్టిగారెకు నోటీసులు




**హైదరాబాద్, జూన్23 (జనంసాక్షి) :** హైదరాబాద్ పరిధిలోని రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న రెండు ప్రముఖ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలను, తీవ్రమైన లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వస్తూ, ఈగలు ముసురుతున్నాయి. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోగా.. గ్రైండింగ్, కూరగాయలు కట్ చేసే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారింది. అంతేకాకుండా, వంటకు ఉపయోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై ఎలాంటి లేబులింగ్ లేకపోవడం గమనించారు. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు తిరుగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి తోడు మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్‌కు సంబంధించిన ఎలాంటి రికార్డులు రెస్టారెంట్ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. దీంతో ఫుడ్ లేబులింగ్, హౌస్‌కీపింగ్ వెంటనే మెరుగుపరచాలని ఆదేశిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు. నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లోనూ తనిఖీలు కొనసాగాయి. ఇక్కడ నిల్వ ఉంచిన చికెన్, డెజర్ట్స్‌పై ఎలాంటి లేబుల్స్ లేవని అధికారులు గుర్తించారు. ఆ లేబుల్స్ లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే పారవేయించారు. గ్రైండింగ్ ఏరియా సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా పూర్తిగా జిడ్డుగా మారినట్లు కనుగొన్నారు. ఆ జిడ్డును వెంటనే శుభ్రం చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ రెస్టారెంట్‌లోనూ ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు లేకపోవడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేశారు.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370